PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 87 | విజయవాడ, మంగళవారం 28 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 28 October 2025 | Rs

లౌకికవాదం, రాజ్యాంగ విలువల పరిరక్షణే లక్ష్యం !

- ఎన్ఇపిని అంగీకరించినట్లు కాదు
- ఎన్‌సిఇఆర్‌టి సమావేశంలో కేంద్ర విధానాలను ఎండగట్టాం
- పిఎం-శ్రీ అమలుపై కేరళ విద్యా మంత్రి శివన్‌కుట్టి వివరణ

7



షెఫాలీ ఇన్.. ప్రతీక రావల్ ఔట్.. 8

ఆస్ట్రేలియాతో సెమీస్‌కు ఎంపిక • ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

విదేశీ సంస్థల చేతికి ప్రభుత్వ బ్యాంక్‌లు..!

- 20 నుంచి 49 శాతానికి ఎఫ్‌డిఐల పెంపు
- మోడీ సర్కార్ ప్రతిపాదనలపై ఆర్‌బిఐ సంప్రదింపులు

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న ప్రభుత్వరంగ బ్యాంక్‌లను క్రమంగా ప్రయివేటు, విదేశీపరం చేసేలా మోడీ సర్కార్ కుట్రలు పన్నుతోంది. ఇందుకోసం ప్రభుత్వ బ్యాంకులలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 49 శాతానికి పెంచేలా కొత్త ప్రతిపాదనలు చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకు(పిఎస్‌బి)ల్లో ప్రస్తుతం ఎఫ్‌డిఐల పరిమితి 20 శాతంగా ఉంది. దీన్ని రెట్టింపు పైగా చేయడానికి వీలుగా భారత రిజర్వ్ బ్యాంక్‌తో ఆర్థిక మంత్రిత్వ శాఖ చర్చలు జరుపుతోంది. ప్రయివేటు బ్యాంక్‌ల కంటే పిఎస్‌బిలు బలహీనంగా ఉన్నా యని.. వాటికి మరింత మూలధనం అవసరమని మోడీ సర్కార్ తప్పుడు ప్రచారం చేస్తూ ఈ రంగంలో ఎఫ్‌డిఐలకు రెడ్‌కార్పెట్ వేస్తోంది. దేశంలో 12 ప్రభుత్వ రంగ బ్యాంకులున్నాయి. వీటి మొత్తం ఆస్తులు 1.95 లక్షల కోట్ల డాలర్లుగా (దాదాపు రూ.170 లక్షల కోట్లు) ఉంది. ఇవి బ్యాంకింగ్ రంగంలో 55 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ప్రభుత్వం ఈ బ్యాంకుల్లో కనీసం 49 శాతం వాటాకు తగ్గించుకోవాలనేది లక్ష్యం. ప్రస్తుతం కెనరా బ్యాంక్‌లో విదేశీ యాజమాన్యం వాటా 12 శాతం ఉండగా, యూకో బ్యాంక్‌లో దాదాపు సున్నాకి దగ్గరగా ఉంది.

ఎన్ని ఆర్థిక సంక్షోభాలు వచ్చినా భారత బ్యాంక్‌లు పటిష్టంగా పని చేయడంతో విదేశీ సంస్థలు ఇక్కడి విత్త సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయి. ఇటీవల ఆర్‌బిఎల్ బ్యాంక్‌లో 60 శాతం వాటాను 3 బిలియన్ డాలర్ల (రూ.26వేల కోట్లు)కు దుబాయ్‌కు చెందిన ఎమిరేట్స్ ఎన్‌బిడి కొనుగోలు చేసింది. యెస్ బ్యాంక్‌లో 20 శాతం వాటాను 1.6 బిలియన్ డాలర్ల (రూ.14వేల కోట్లు)కు జపాన్‌కు చెందిన సుమిటోమో మిత్సుయ్ బ్యాంక్ స్వాధీనం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బ్యాంకుల్లో వాటాలను విదేశీ సంస్థలకు విక్రయించడం ద్వారా ఖజానా నింపుకోవాలని కేంద్రం యోచిస్తోంది.

వణికిస్తోన్న మొంథా

సిఎంకు ప్రధాని ఫోన్


శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు రెడ్ అలర్ట్

ఎనిమిది జిల్లాలకు ఆకస్మిక వరదల ముప్పు

విజయవాడకు భారీ వర్ష సూచన

పలు బస్సులు, రైళ్లు రద్దు - విమాన సర్వీసులు నిలిపివేత

నేడు తీవ్ర తుపానుగా మారి రాత్రికి తీరం దాటే అవకాశం



మొంథా తుపాను ఐఎండి చిత్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దూసుకువస్తున్న మొంథా తుపాన్ తీరప్రాంతాన్ని వణికిస్తోంది. రాష్ట్రంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారయంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాష్ట్ర ముఖ్యమంత్రికి ఫోన్ చేశారు. పరిస్థితి తీవ్రతపైనా, చేపడుతున్న చర్యలపైనా ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదయం నుండి రాత్రి వరకు అధికారులతో పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు. ప్రాణ నష్టం లేకుండా చూడాలని, సాధ్యమైనంత మేరకు ఆస్థినష్టాన్ని తగ్గించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం నుండే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తుపాన్ ప్రభావంతో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు పడుతున్నాయి. అనేకచోట్ల సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. రాత్రి పది గంటల ప్రాంతానికి తీరప్రాంతమంతా గాలుల ఉధృతి పెరిగింది. పోర్టులలో ఐదవ నెంబర్ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. తుపాన్ తీరానికి సమీపించే కొద్ది మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని, మంగళవారం ఉదయానికి తీవ్ర తుపాన్‌గా బలపడుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో గంటకు వంద కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని, అనేకచోట్ల భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు (ఉమ్మడి జిల్లాలు) రెడ్ అలెర్ట్ ప్రకటించింది. దీంతో ఈ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. రాయలసీమ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ అయ్యింది. అదే సమయంలో రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని ఎనిమిది ఉమ్మడిజిల్లాల్లో ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) విరుచుకుపడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ నుండి హెచ్చరికలు అందాయి. విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయి. మంగళవారం నాడు విజయవాడలో భారీ వర్షాలు కురుస్తాయంటూ తాజాగా హెచ్చరికలు జారీ అయ్యాయి. విజయవాడ నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో 16 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఈ హెచ్చరికల్లో వాతావరణ శాఖ పేర్కొంది. దుకాణాలు, వాణిజ్య సంస్థలను మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. తుపాన్ తీవ్రత నేపథ్యంలో రాష్ట్రంలో 100కు పైగా రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. ఆర్‌టిసి కూడా పలు బస్సు సర్వీసులను నిలిపివేసింది. రాష్ట్రంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో కార్యక్రమాలను నిలిపివేశారు. మొంథా తుపాను 233 మండలాల్లోని 1,419 గ్రామాలు, 44 మున్సిపాలిటీల్లో ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. మంగళవారం రాత్రికి కాకినాడ, యానాం మధ్య తీరం దాటుతుందని భావిస్తున్నారు.



విశాఖపట్నం సముద్ర తీరంలో అలల ఉధృతి

ప్రజలకు అండగా నిలబడండి

- సిపిఎం కార్యకర్తలకు వి శ్రీనివాసరావు విజ్ఞప్తి

2

4 నుంచి రెండో దశ ఎస్‌ఐఆర్

- షెడ్యూల్ ప్రకటించిన ఇసి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఎన్నికల జాబితాల్లో సవరణలను నవంబర్ 4 నుంచి చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ప్రకటించారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండో దశలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) పరిధిలో 51 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితాను నవీకరించడం, ధ్రువీకరించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను జాబితాలో ఉంచడానికి ఈ ప్రక్రియ చేపడుతున్నామని చెప్పారు. ఎన్నికల జాబితాలో అవకతవకలను ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్నందున ఎస్‌ఐఆర్ ప్రక్రియ అవసరమైందని అన్నారు.

ఎస్‌ఐఆర్ రెండో దశ షెడ్యూల్ ఇదే..

ఎస్‌ఐఆర్ రెండో దశ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబరు 28 నుంచి నవంబరు 3 వరకూ ప్రింటింగ్/ట్రైనింగ్ ఉంటుంది. నవంబరు 4 నుంచి డిసెంబరు 4 వరకూ హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ ఫేజ్ ఉంటుంది. డిసెంబరు 9న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేస్తుంది. డిసెంబరు 9 నుంచి 2026 జనవరి 8 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. హియరింగ్ / వెరిఫికేషన్ ప్రక్రియ డిసెంబరు 9 నుంచి 2026 జనవరి 31 వరకూ జరుగుతుంది. 2026 ఫిబ్రవరి 7న తుది ఎన్నికల జాబితా విడుదలవుతుంది. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, గోవా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ, కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలో ఎస్‌ఐఆర్ చేపడతారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలో 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల కమిషన్ ప్రకటన ఏకపక్షం..


సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

7లో

అమరావతి కోసం 'ఎజిఐసిఎల్'

- మరో కొత్త వ్యవస్థ ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఎపి సిఆర్‌డిఎ కార్యాలయం

రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి కోసం మరో కొత్త వ్యవస్థ ఏర్పాటైంది. ఇప్పటికే సిఆర్‌డిఎ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్లు ఉండగా కొత్తగా 'అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎజిఐసిఎల్)'ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు ఈ నెల 21వ తేదీన రాసిన లేఖ మేరకు ఈ ఉత్తర్వులు విడుదల చేసినట్లు అందులో పేర్కొన్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి వ్యవహరించే ఈ కార్పొరేషన్లో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, విద్యుత్‌శాఖ, ఆర్‌అండ్‌బి శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, పరిశ్రమలశాఖ కార్యదర్శి, సిఆర్‌డిఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉండనున్నారు. ముగ్గురు ఇండిపెండెంట్ డైరెక్టర్లనూ ఎంపిక చేయనున్నారు. 2013 కంపెనీ యాక్టు ప్రకారం ఎమ్‌డిని కూడా నియమించనున్నారు. కోటి రూపాయల పెయిడ్‌అప్ క్యాపిటల్‌గా షేర్‌ను పదిరూపాయలుగా నిర్ధారించి పదిలక్షల షేర్లను ఈ సంస్థ కోసం ప్రకటించింది. వీటిల్లో ప్రభుత్వం పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శికి 999994 షేర్లు కేటాయించింది. మిగిలిన వారికి ఒక్కో షేర్ ఇచ్చింది. ఎపిసిఆర్‌డిఏ, ప్రభుత్వం నిర్ధారించిన ప్రాజెక్టులను అమలు చేయడం, ప్లానింగు, అభివృద్ధి, ఆర్థికసాయం, నిర్వహణ వంటి పనులను కొత్త కంపెనీ కూడా అమలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా అమరావతి రాజధాని పరిధిలో ప్రైవేటు వ్యక్తుల ద్వారా వచ్చే కొత్త ప్రాజెక్టులను గుర్తించడం, పిపిపి, హైబ్రీడ్ యాన్యుటీ మోడల్, ఈపిసి వంటి వాటి కింద వచ్చేవారిని గుర్తించి వాటిని అమలు చేయడం కొత్త కంపెనీకి ప్రధాన బాధ్యతగా నిర్ణయించారు. అలాగే నిధుల సేకరణలోనూ భాగస్వామ్యం కల్పించారు.

తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

- కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ బిఆర్ గవాయ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును ప్రస్తుత సిజెఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ సోమవారం కేంద్రానికి సిఫార్సు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తిని సిజెఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ మోస్ట్ న్యాయ మూర్తిగా ఉన్నారు. జస్టిస్ బిఆర్ గవాయ్ నవంబరు 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో నవంబరు 24న దేశ 53వ సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టనున్నారు. 2027 ఫిబ్రవరి 9 వరకూ 15 నెలల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఇప్పటి వరకు 300 ధర్మాసనాల్లో భాగంగా ఉన్నారు.

గిరిజనులపై దమనకాండ

- 'థర్మల్' ధర్నా భగ్నానికి విఫలయత్నం
- ఉద్యమ నాయకుల అరెస్టు
- పోలీసులపై గిరిజనుల ఆగ్రహం
- వర్షంలోనూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన
- ప్రభుత్వ చర్యలకు వామపక్షాల ఖండన



సరుబుజ్జిలి - పాలకొండ రహదారిపై నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, సరుబుజ్జిలి, అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా బూర్జ–సరుబుజ్జిలి ప్రాంతంలో ప్రతిపాదించిన జెన్‌కో సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటును నిరసిస్తూ వామపక్షాలు, ప్రజాసంఘాలు సరుబుజ్జిలి తహాశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం తలపెట్టిన మహాధర్నాను అడ్డుకునేందుకు ప్రభుత్వం విఫలయత్నం చేసింది. పోలీసులను ఉపయోగించి ధర్నా జయప్రదం కాకుండా రకరకాలుగా ప్రయత్నించింది. ఉదయం నుంచే సరుబుజ్జిలికి వెళ్లే అన్ని రహదారులనూ దిగ్బంధించింది. వామపక్ష, థర్మల్ వ్యతిరేక పోరాట ముఖ్య నాయకులను అరెస్టులు చేయించింది. అక్రమ అరెస్టులను వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. థర్మల్ వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొనకుండా పోలీసులు ఉదయం నుంచే పోలీసులు అరెస్టుల పర్వం మొదలుపెట్టారు. శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి డి గోవిందరావును అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చాపరలో సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణను గృహ నిర్బంధం చేశారు. అడ్డూరుపేట వద్ద ఆదివాసీ గిరిజన పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ సహాయక కార్యదర్శి వంకల మాధవరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, పోరాట కమిటీ అధ్యక్షులు సవర సింహాచలం, కొన్నా శ్రీనివాస్, బిసంతోష్‌తోపాటు పలువురిని ఎక్కడికక్కడ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. నాయకుల అరెస్టులను తెలుసుకున్న గిరిజనుల్లో ఆగ్రహం పెల్లుబికింది. బూర్జ మండలం మసాన్‌పేట, పిఎల్ దేవిపేట, తిమడాం, అన్నంపేట, అడ్డూరిపేట తదితర గ్రామాల నుంచి గిరిజనులు ధర్నా ప్రాంతానికి భారీగా బయలుదేరారు. సరుబుజ్జిలి మండలం చిగురువలస వద్ద వారిని మిగతా 7లో

జైళ్ల కన్నా ఘోరంగా...

వి.గోపి, తిరుపతి బ్యూరో



సత్యవేడు కుమ్మరి వీధిలోని బిసి బాలుర వసతిగృహం పరిస్థితి

రోజూ 24 గంటల దుర్గంధం. ఒక్క నిమిషం కూడా ఉండలేని పరిస్థితి. చిన్నపాటి గదులు. పాచిపట్టిన నేల. విరిగిపోయిన ట్రంకు పెట్టెలు చుట్టూ పెట్టుకుని అక్కడే మునగదీసుకుని 15 మంది పడుకోవాలి. తిరిగీతిరగని ఫ్యాన్లు. విద్యార్థులందరికీ ఒకేఒక్క ఓపెన్ బాత్రూమ్. కిటికీలకు దోమతెర లేదు. పైకప్పు ఎప్పుడు ఊడిపడుతుందో తెలియదు. శిథిలావస్థలో ఉన్న పెచ్చులూడిన పెంకుల భవనం. ఇది తిరుపతి జిల్లా సత్యవేడులోని బిసి బాలుర వసతి గృహం దుస్థితి. పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఈ వసతి గృహానికి ఏటా లక్ష రూపాయల అద్దెను ప్రభుత్వం చెల్లిస్తోన్న కనీస సౌకర్యాలు మచ్చుకైనా లేవు. జైలేనయం అనిపించేదిగా ఉంది. తిరుపతి జిల్లాలో ఎస్‌సి హాస్టళు 36, ఎస్‌టి హాస్టళ్లు16, గురుకులాలు ఎనిమిది, బిసి హాస్టళ్లు 31 ఉన్నాయి. మొత్తం 16 వేల మంది వీటిలో చదువుతున్నారు. సోమవారం 'ప్రజాశక్తి' దళిత నియోజకవర్గమైన సత్యవేడులోని పలు హాస్టళ్లను పరిశీలించింది. కుమ్మరతోపులో నాలుగు దశాబ్దాలుగా అద్దె గదిలో ఉంటున్న బిసి బాలుర వసతి గృహం ఘోరాతి ఘోరంగా ఉంది. హాస్టల్ ఎక్కడ ఉందో వెతుక్కోవాల్సిన పరిస్థితి. బోర్డు ఎక్కడా కనిపించదు. కుమ్మరి వీధి మధ్యలో ఓ చిన్న వరండాలో దూరి వెళితే శిథిలావస్థలో ఉన్న ఓ పెంకుటింట్లో ఈ వసతి గృహం ఉంది. విద్యార్థుల వంట గది మొదట కనిపిస్తుంది. తలుపులు విరిగిపోయి, పైకప్పు ఊడిపోయి ఉన్నాయి. వంట గది ఎదురుగానే ఉన్న 'మ్యాన్‌హోల్' చూస్తే కడుపులో తిప్పే పరిస్థితి. ఆ పక్కనే వార్డెన్ బాత్రూమ్. దీనికి తలుపు లేదు. నీళ్లు రావు. పిల్లల గదులు గుండె తరుక్కుపోయేలా ఉన్నాయి. ఎంతో అల్లారుముద్దుగా తల్లిదండ్రుల వద్ద పెరిగిన పిల్లలు పాచిపట్టిన గతుకుల నేలపై గుడ్డపరచి పడుకోవాల్సిన దుస్థితి. ట్రంకు పెట్టెలన్నీ డొక్కుగా కనిపించాయి. ఫ్యాన్లు తిరుగదామా వద్దా అనేలా ఉన్నాయి. కరెంట్ వైరింగ్ సరిగ్గా లేదు. మొత్తం 94 మంది పిల్లలకు ఒకేచోట ఓపెన్ బాత్రూం. సత్యవేడు, కుమిటిగుండ, పెద్ద ఈటిపాకం, చిన్న ఈటిపాకం, పాండూరు, కన్నవరం, జడేరి, అల్లాగుంట ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు.

బిసి కాలనీలోని మరో బిసి బాలుర (డిప్లొమా విద్యార్థులు) హాస్టల్‌ను పరిశీలించగా, దీని పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. పదేళ్ల క్రితం వరకూ ఇది అద్దె భవనంలో ఉండేది. ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో యజమాని ఖాళీ చేయమనడంతో పదేళ్ల క్రితం ఎస్‌టి విద్యార్థుల పాత హాస్టల్లోకి మార్చారు. అప్పటికే శాశ్వత భవనం నిర్మించడంతో ఎస్‌టి విద్యార్థులు అక్కడికి వెళ్లిపోయారు. 40 మంది డిప్లొమా విద్యార్థులు పాత భవనంలో మూడేళ్లగా ఉంటున్నారు. సత్యవేడు పాలిటెక్నిక్ కాలేజీలో వీరు మిగతా 7లో

బిసి హాస్టళ్ల దుస్థితి

గదుల్లో 'నిమిషం' ఉండలేని దుర్గంధం

భయంభయంగా విద్యార్థులు

అద్దె గదుల్లోనే దశాబ్దాలుగా...

బడుగు, బలహీన 'సంక్షేమం' ఉత్తిదే

ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లపై చర్యలు తీసుకోండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి



ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్ జెండర్లకు రిజర్వేషన్ల కల్పనపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సోమవారం హైకోర్టు ఆదేశించింది. సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్రానికి ఆదేశించింది. ట్రాన్స్ జెండర్లకు కర్ణాటకలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఒకశాతం రిజర్వేషన్ కల్పిస్తున్నందున రాష్ట్రంలోనూ అదే తరహా నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని చెప్పింది. కర్ణాటకలో అమలు తీరును అధ్యయనం చేసి, రిజర్వేషన్ కల్పనపై నివేదిక అందజేయాలంది. విచారణను 4 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. 2018 నవంబర్లో జారీ చేసిన ఎస్‌ఐ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో ట్రాన్స్ జెండర్లకు రిజర్వేషన్ కల్పన అంశం లేదంటూ ట్రాన్స్ జెండర్ గంగా భవానీ ఆ తర్వాత ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఎస్‌ఐ పోస్టుకు ఇచ్చిన దరఖాస్తు కాలమ్లో స్త్రీ, పురుష ఐచ్ఛికాలు మాత్రమే ఉన్నాయని, ట్రాన్స్ జెండర్ కాలమ్ లేదని, దీంతో తాను స్త్రీగా ఐచ్ఛికం ఇవ్వాల్సి వచ్చిందని భవానీ పిటిషన్‌లో వివరించారు. రాత పరీక్షలో 35 శాతం మార్కులు వచ్చినప్పటికీ అధికారులు తదుపరి ప్రక్రియకు తనను అనర్హురాలిగా ప్రకటించారన్నారు. దీనిపై పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టేయడంతో అప్పీల్ దాఖలు చేయాల్సి వచ్చిందని వివరించారు. గంగా భవానీకి ఉద్యోగం కల్పించే విషయంలో నిర్ణయం తీసుకోవాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీతిని గతేడాది బెంచ్ ఆదేశించింది. ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ వాదిస్తూ, పిటిషనర్‌కు 28 శాతమే మాత్రమే మార్కులు వచ్చాయన్నారు. అర్హతకు 35 శాతం మార్కులు రావాలన్నారు. కర్ణాటకలో ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్ జెండర్లకు ఒక శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని చెప్పారు.

కాకినాడకు రెడ్ అలర్ట్

- శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు వర్షాలు
- విశాఖకు ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలు రద్దు
- అల్లూరిలో పర్యాటక ప్రాంతాలు మూసివేత

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను నేపథ్యంలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. కాకినాడ, ఏలూరు, విశాఖ, శ్రీకాకుళంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం ఉన్నందున కాకినాడకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. సముద్ర తీరం వెంబడి ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది వద్ద 500 మీటర్ల మేర సముద్రం వెనక్కి వెళ్లింది. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డుపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలోని బొర్రా గుహలను, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలపాతాన్ని, ఇతర పర్యాటక ప్రాంతాలను అధికారులు మూసేశారు. విశాఖ మీదుగా నడిచే 29 రైళ్లను రద్దు చేశారు. శ్రీకాకుళంలో జిల్లా గారలో అత్యధికంగా 52 మి.మీ వర్షం కురిసింది. కంచిలిలో అత్యల్పంగా 1.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కాకినాడలో ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు 40 బోట్లను, వంద మంది సిబ్బందిని, 140 గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. 50 మందితో ఎస్‌డిఆర్ఎఫ్, 30 మందితో ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే కాకినాడకు చేరుకున్నాయి. జిల్లాలో 269 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రానికి ఇన్‌ఛార్జులను నియమించారు.

విశాఖలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో విశాఖలో 12,755 ఇళ్లు కొండవాలు ప్రాంతాల్లో ఉండగా వాటిలో 96 ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నట్టు గుర్తించి అక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 20 సైక్లోన్ షెల్టర్లు, 23 పునరావాస కేంద్రాలకు సుమారు తొమ్మిది వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. నక్కపల్లి మండలంలోని తీరగ్రామాల్లో తొమ్మిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 16 పునరావాస కేంద్రాలు, 26 పక్కా భవనాలు పునరావాసానికి సిద్ధం చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని గరాలదిబ్బ, గిలకలదిండి గ్రామాలు, పామర్రు, నందివాడ,గుడివాడ, బంటుమిల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను అధికారులు పరిశీలించి, సదుపాయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరులో సోమవారం సాయంత్రం నుంచి మోస్తరు వర్షం కురిసింది.

ఏలేరుకు పోటెత్తుతున్న వరద నీరు

ఎగువన కురుస్తున్న వర్షాలతో ఏలేరు రిజర్వాయర్‌కు వరద నీరు పోటెత్తుతోంది. 24 టిఎంసిల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 22 టిఎంసిలు నమోదయ్యాయి. సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ఉన్న పెద్ద ఏలేరు బ్రిడ్జి వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీటిని మరింత కిందకు వదిలితే 30 వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

తెలుగంగ కాలువలో ఇద్దరు గల్లంతు

తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలానికి చెందిన ఇరిగేషన్ శాఖ ఎఇ బాబు తన కారు కడిగేందుకు కారు డ్రైవర్ షరీఫ్ అలియాస్ చిట్టి (40), మనవడు మహిత్ (6)తో కలిసి ఉబ్బలమడుగు సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్దకు ఆదివారం వెళ్లారు. కారు కడుగుతుండగా మహిత్ కాలుజారి కాలువలో పడిపోయారు. బాలుడిని కాపాడేందుకు కాలువలోకి దూకిన బాబు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయారు. వారిద్దరిని కాపాడేందుకు షరీఫ్ కూడా కాలువలోకి దూకాడు. చెట్టుకొమ్మకు వేలాడుతున్న బాబును స్థానిక మత్స్యకారులు గమనించి కాపాడారు. గల్లంతైన షరీఫ్, మహిత్‌ల కోసం పోలీసులు గాలించగా సోమవారం మహిత్ మృతదేహం లభించింది. షరీఫ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వాగు దాటుతూ విద్యార్థి గల్లంతు

మేనమామతో కలిసి బైకుపై కాల్వ దాటుతూ విద్యార్థి కొట్టుకుపోయిన సంఘటన కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట పర్ర కాలువ వద్ద సోమవారం చోటుచేసుకుంది. తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం... 6వ తరగతి విద్యార్థి పోలవరపు సాయి చరణ్ (11) తన మేనమామతో కలిసి సూర్యారావుపేట నుంచి పర్రకాలువ మీదుగా ఉన్న వంతెనపై బైకుపై వెళుతుండగా ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పడంతో బాలుడు వాగులో కొట్టుకుపోయాడు. పోలీసులు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.



కాకినాడలో నెలవాలిన వరిపంట

ప్రజలకు అండగా నిలబడండి

సిపిఎం కార్యకర్తలకు వి శ్రీనివాసరావు విజ్ఞప్తి

తుపాను నేపథ్యంలో ప్రజలకు అండగా నిలబడి ప్రభుత్వ యంత్రాంగానికి తోడ్పడాలని సిపిఎం కార్యకర్తలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. మొంథా తుపాను రానున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తమై ప్రజలకు అండగా నిలవాలని కోరారు. కోస్తా జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించిందని తెలిపారు. ప్రభుత్వ సహాయం ప్రజలకు సకాలంలో అందే విధంగా, వారిని సహాయక శిబిరాలకు చేర్చే విషయంలో తోడ్పడాలని కోరారు.

తుపానును ఎదుర్కొనేందుకు సంసిద్ధం

- ఏర్పాట్లు చేసిన విద్యుత్ సంస్థలు
- సమీక్షలో సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపానును ఎదుర్కొనేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ వెల్లడించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే పునరుద్ధరణకు కావాల్సిన సిబ్బంది, సామగ్రితో విద్యుత్ సంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులతో సోమవారం ఆయన సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైనప్పుడు విద్యుత్ సరఫరా తక్షణం పునరుద్ధరించడానికి సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో పంపిణీ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కంట్రోల్ రూములు, కమ్యూనికేషన్ వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది పనిచేయాలని, తుపాను ప్రభావం తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని సూచించారు. జెన్‌కో ఎమ్‌డి ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. జెన్‌కో థర్మల్ ప్లాంట్లలో అన్ని అత్యవసర వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ జోన్లలోని ఎనిమిది జిల్లాల్లో పునరుద్ధరణకు కావాల్సిన సామగ్రి, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ట్రాన్స్‌కో జెఎమ్‌డి జి సూర్యసాయి ప్రవీణ్ చంద్ వెల్లడించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, వేగవంతమైన పునరుద్ధరణకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డిస్కమ్‌ల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, ఎల్ శివశంకర్, పి పుల్లారెడ్డి తెలిపారు.

బస్సులు నిలిపివేయండి

- తుపాన్ నేపథ్యంలో ఆర్‌టిసిఎ ఎమ్‌డి ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తుపాన్ ప్రభావిత ప్రాంతాలకు బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేయాలని ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు అధికారులను ఆదేశించారు. జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, జిల్లా ప్రజా రవాణా అధికారులతో సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాలకు రాత్రి హాల్ట్ సర్వీసులు రద్దు చేయాలని, దూరప్రాంత బస్సుసేవలను అవసరాన్ని బట్టి రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రయాణీకులకు ముందుగానే బస్సు రద్దు విషయం సమాచారం ఇవ్వాలన్నారు. బలమైన గాలులు, భారీ వర్షాలు ఉన్న ప్రాంతాలకు సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని జిల్లా యంత్రాంగం, పోలీస్, రైల్వేలతో సమన్వయం చేస్తూ అవసరమైన బస్సులను అందించాలని ఎండి ద్వారకా తిరుమలరావు సూచించారు. సోమవారం రాత్రి నుంచి సాధారణ స్థితికి వచ్చే వరకు అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన కార్యాలయాల్లో 24-7 కమ్యూనికేషన్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రెండు గంటలకోసారి ఆపరేషన్ స్థితిపై నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి డిపోలో 10మంది డ్రైవర్లు, 10మంది కండక్టర్లు సిద్దంగా ఉంచాలని, డిపోలు, బస్‌స్టేషన్లు ఉన్న జనరేటర్లు పనిచేసే స్థితిలో ఉంచాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాల్లో ఉన్న డిపోల బస్సులను ఎత్తైన ప్రాంతాలకు తరలించాలని, రద్దు చేసిన సేవల వివరాలను బస్ స్టేషన్లలో ప్రదర్శించాలని ఎండి అధికారులకు సూచించారు.

ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం : మంత్రి నిమ్మల

అమరావతి బ్యూరో : తుపాను ప్రభావిత జిల్లాల్లో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సెలవుల్లో ఉన్న అధికారులు వెంటనే విధుల్లో చేరాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. తుపానుపై ఇరిగేషన్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చెరువులు, కాల్వగట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేయాలని కోరారు. బుడమేరు డైవర్షన్ ఛానల్‌పై నిరంతరం నిఘా ఉండాలని ఆదేశించారు. అవసరమైన ఇసుక బస్తాలు, మోటార్లు, బోట్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. గేట్లు, స్లూయిస్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని చెప్పారు. రిజర్వాయర్ల నుండి దిగువకు నీరు వదిలితే దిగువ ప్రాంత ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని ఆదేశించారు. విజయవాడ నగరంలో బుడమేరులో ఎటువంటి అడ్డంకులూ లేకుండా చూడాలని కోరారు.

రాయితీల విడుదలకు అంగీకారం

- జెఎసి నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రావాల్సిన రాయితీలను వంద శాతం విడుదల చేసేందుకు పరిశ్రమలశాఖ అంగీకరించిందని జెఎసి నాయకులు వెల్లడించారు. ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు అనార్ బాబు, రాజశేఖర్, సత్యానందరావు, త్రిమూర్తులు, విజయ్ రాయితీల గురించి పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభమన్ బన్సల్, అదనపు డైరెక్టర్ రామలింగరాజు, జెడి శ్రీనివాస్‌ను సోమవారం కలిసి చర్చించారు. అధికారులు సోమ, మంగళవారాల్లో పెండింగ్‌లో ఉన్న పరిశ్రమలకు చెల్లింపులు విడుదల చేస్తామన్నారని, మిగిలిన 80 శాతం సబ్సిడీ కూడా ఈ నెలాఖరుకు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ నెలాఖరుకు చెల్లింపులు పూర్తి చేయకపోతే, నవంబరులో విశాఖ పార్ట్‌నర్ షిప్ సమ్మిట్‌ను బహిష్కరిస్తామని పారిశ్రామికవేత్తలు స్పష్టం చేశారు. ఈ మేరకు నోటీసును అందజేశారు. సమ్మిట్ సమయంలో నిరాహార దీక్ష చేపడతామని పరిశ్రమలశాఖ డైరెక్టర్ బన్సాల్‌కు స్పష్టం చేశారు. తక్షణమే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. 20 శాతం కోసం 4 ఏళ్లుగా వేచి ఉన్నామని, 80 శాతం కోసం ఎంత కాలం వేచి ఉండాలని ప్రశ్నించారు. తుపాను అనంతరం మరోమారు చర్చించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని జెఎసి నాయకులు వెల్లడించారు.

రక్షణ చర్యల బాధ్యత కలెక్టర్లదే

- తుపానుపై సమీక్షలో సిఎం
- ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, రూ.3000 నగదు, నిత్యావసరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



సమీక్షిస్తున్న సిఎం

తుపాను సమయంలో రక్షణ చర్యల బాధ్యత కలెక్టర్లదేనని, ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోమవారం తుపానుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పునరావాస కేంద్రాల్లో ఉండే ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, రూ.3000 నగదు, నిత్యావసర సరుకులు అందించేలా చూడాలని ఆదేశించారు. అలాగే వైద్య సేవల కోసం సిబ్బంది అందుబాటులో ఉండాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వాలని సూచించారు. ప్రతి కేంద్రానికి ఒక ఇన్‌ఛార్జిని నియమించాలని తెలిపారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ఎక్కడా కలుషితం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని, ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. వాలంటరీగా వచ్చేవారిని తుపాను సహాయక చర్యలకు ఉపయోగించుకోవాలని, ప్రభుత్వ యంత్రాంగమంతా నిబద్ధతతో పనిచేసి మొంథా తుపానును సమర్థవంతంగా ఎదుర్కోవాలని కోరారు. మానవప్రయత్నంలో ఎటువంటి అలసత్వమూ కనిపించకూడదని తెలిపారు. దీనిపై నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఆదివారం రాత్రి నుండి వర్షాలు పడుతున్నాయని, అన్ని చర్యలూ తీసుకున్నామని పేర్కొన్నారు. ఎక్కడా కాలువగట్లు, చెరువులకు గండిపడకుండా చూడాలని తెలిపారు. భారీవర్షాలతో నీరు ఎక్కడా నిలిచిపోకుండా డ్రెయినేజీ వ్యవస్థను పర్యవేక్షించాలని, తుపాను సమయంలో ప్రజలు బయటకు రాకుండా చూసుకోవాలని కోరారు. విజయవాడ, మంగళగిరి వంటి కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడకుండా జాగ్రత్తచర్యలు చేపట్టాలన్నారు. మొంథా తుపాను కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుపాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్‌గా ఉండాలని సిఎం అన్నారు.

యంత్రాంగం అప్రమత్తం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం కాకినాడ కలెక్టర్‌తో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పునరావాస కేంద్రాలకు వెళ్లిన ఇళ్లకు భద్రత కల్పించాలని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పిఠాపురం నియోజకవర్గంతోపాటు కాకినాడ జిల్లా వ్యాప్తంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

సంయమనం పాటించాలి : హోంమంత్రి అనిత

ప్రజలకు వేగంగా సమాచారాన్ని చేరవేసే సోషల్, డిజిటల్ మీడియా సంస్థలు తుపాను వార్తల కవరేజ్ విషయంలో సంయమనం పాటించాలని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సంచలనాల కోసం పెట్టే తప్పుడు హెడ్డింగ్‌లు, థంబ్ నెయిల్స్ కారణంగా ప్రజల్లో తీవ్ర గందగోళం నెలకొనే పరిస్థితి నెలకొందన్నారు. వాస్తవాలకు అద్దంపట్టేలా వార్తల కవరేజ్ చేయాలని ఆమె కోరారు.

విజయవాడ డివిజన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మొంథా తుపాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ సోమవారం విజయవాడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గన్నవరం సెక్షన్ వరకు రైల్వే రియర్ విండోను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో ట్రాక్ పరిస్థితులు, సిగ్నలింగ్ వ్యవస్థలు, వంతెనలు వంటి భద్రతా అంశాలను ఆయన సమీక్షించారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో జనరల్ మేనేజరు ప్రయాణికుల సౌకర్యాలు, స్టేషన్ సౌకర్యాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సర్క్యులేటింగ్ ఏరియాపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సమీక్షలో విజయవాడ రైల్వే డిఆర్ఎం మోహిత్ సోనాకియా, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వేలో 95 రైళ్లు రద్దు

తుపాను నేపథ్యంలో రెండు రోజులపాటు 95 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విజయవాడ రైల్వే డివిజన్‌లో 54 రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ బాధ్యతలు స్వీకరించారు. మానవేంద్రనాథ్‌తో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ నేలపాడులోని హైకోర్టు మొదటి కోర్టు హాల్లో సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన మానవేంద్రనాథ్ 2002లో జిల్లా జడ్జి కేడర్లో నియమితులయ్యారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో న్యాయసేవలు అందించారు. 2015 జులై నుంచి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా, 2019 నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారు. 2023 నవంబరులో గుజరాత్ హైకోర్టుకు బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి మరలా రాష్ట్రానికి వచ్చారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె చిదంబరం, ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్ ద్వారకానాథ్ రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ సాంబశివ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ రద్దుకు మోడీ, అమిత్‌షా కుట్ర

- సమస్యల పరిష్కారానికి ఉద్యోగులతో చర్చలు జరపాలి
- ధర్నాలో వి.శ్రీనివాసరావు


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడం ద్వారా సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసి రద్దుచేసేందుకు ప్రధాని మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలు ప్రయత్నిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ గాంధీనగర్ దర్నా చౌక్‌లో సోమవారం ఎపి స్టేట్ అగ్రికల్చరల్ కో- ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు టి.వెంకటరామయ్య అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ ధర్నాలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సహకార వ్యవస్థను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. హరిత విప్లవం విజయవంతమయ్యేందుకు సహకార వ్యవస్థే కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారరంగాన్ని తన ఆధీనంలోకి తీసుకుని ప్రైవేటుకు అప్పజెబుతోందన్నారు. న్యాయమైన సమస్యల సాధన కోసం పోరాడుతున్న పిఎసిఎస్ ఉద్యోగులకు గతంలో మాదిరిగానే సిపిఎం మద్దతు కొనసాగిస్తుందన్నారు. పెట్టుబడుల కోసం విదేశాల్లో పర్యటిస్తున్న సిఎం చంద్రబాబు, రాష్ట్రంలో పనిచేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తప్పనిసరిగా వారిని చర్చలకు పిలవాలని ఆయన డిమాండ్ చేశారు. 2019లో ప్రభుత్వం ఇచ్చిన జీఓ నెంబరు36ను వెంటనే అమలు పరచాలన్నారు. ఎల్ఐసి నిధులు రూ.33వేల కోట్లను అధాని కంపెనీల్లోకి కేంద్రం మార్చిందన్నారు. పిడిఎఫ్‌మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పిఎసిఎస్ ఉద్యోగుల పోరాటానికి పిడిఎఫ్‌తరపున మద్దతును ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి మంత్రులు, అధికారుల వద్దకు తీసుకెళ్లేందుకు తాము యూనియన్ నేతలను తీసుకెళ్లి రాయభారాలు నడుపుతామన్నారు. ఉద్యోగులకు ప్రతి ఐదు సంవత్సరాలకు వేతన సవరణ చేయాల్సిఉండగా ఇప్పటి వరకు జరగకపోవడంతో 2019,2024 వేతనసవరణలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే వేతన సవరణలు చేయాలని, అప్పటిలోగా ఉద్యోగులకు మధ్యంతర భృతిని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సహకార చట్టంలోని నియమాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పదవీ విరమణ వయస్సు 62కు పెంచాలన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాటం తప్ప వేరే మార్గం లేదన్నారు. సహకార రంగం పెట్టుబడిదారి విధానానికి ప్రత్యామ్నాయంగా పనిచేస్తుండటంతో ఈ రంగాన్ని ప్రైవేట్‌కు అప్పజెప్పేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు.సహకార రంగాన్ని కాపాడుకునేందుకు

ఉద్యోగులందరూ కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. ఈ ధర్నాలోఎపి కౌలు రైతుసంఘం ప్రధాన కార్యదర్శి హరిబాబు, యూనియన్ ప్రధానకార్యదర్శి కె.సత్యనారాయణ, కోశాధికారి పి.సత్యనారాయణ,జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ప్రసంగించారు.



నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి

గౌతంరెడ్డి వివాహ రిసెప్షన్‌కు హాజరైన సిఎం

ప్రజాశక్తి- వెల్దుర్తి (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పెద్ద కుమారుడు వివాహ రిసెప్షన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం హాజరయ్యారు. నూతన దంపతులు జూలకంటి గౌతంరెడ్డి, తేజస్వినికి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. అనంతరం జూలకంటి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విదేశీ పర్యటనలో ఉన్నందున వివాహానికి హాజరు కాలేకపోయానని, రిసెప్షన్‌కు వచ్చనని సిఎం తెలిపారు. పల్నాడు జిల్లా వెల్దుర్తికి వచ్చిన సిఎంకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

యజమాని ఎవరు..?

- బయటకు రాని కావేరి ట్రావెల్స్ యజమాని పేరు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి



కర్నూలు శివార్లలోని చిన్న టేకూరు వద్ద వేమూరి కావేరి ట్రావెల్ బస్సు దగ్ధమై 19 మంది సజీవదహనం అయిన దుర్ఘటన చోటు చేసుకుని నాలుగు రోజులు గడిచినా ఇప్పటి వరకూ ట్రావెల్స్ యజమాని పేరు బయటకు రావడం లేదు. ఈ ప్రమాదం జరిగిన రోజు పోలీసులు ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో బస్సు డ్రైవర్, బస్సు ఓనర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అదే రోజు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ట్రావెల్స్ యజమానిని మాత్రం ఇప్పటి వరకూ అదుపులోకి తీసుకోలేదు. ఎఫ్ఐఆర్‌లో కూడా యజమాని పేరు పేర్కొనకపోవడంతో అసలు యజమాని ఎవరు అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. యజమానిని కాపాడేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్న చర్చ కూడా నడుస్తోంది. ట్రావెల్స్ యజమాని సుబ్బారావు అని కొందరు, వేమూరి వినోద్ అని మరికొందరు, వెంకటేశ్వర్లు అని ఇంకొందరు చెబుతున్నారు. అయితే అసలు యజమాని ఎవరనేది పోలీసులు కూడా ఇప్పటి వరకూ వెల్లడించలేదు. 19 మంది సజీవ దహనం అయినా ఇప్పటికీ బస్సులు యథావిధిగా తిరుగుతున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా 70 బస్సులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విశాఖపట్నం రూట్లలో నడుస్తున్నాయి. ప్రమాదం జరిగిన బస్సు సీటింగ్ క్యారియర్‌గా అనుమతి తీసుకుని స్లీపర్ సర్వీస్‌గా నడుపుతున్నారు. తెలంగాణకు చెందిన హెబ్రాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ బస్సును 2018లో కొనుగోలు చేసి 2023 వరకు నిర్వహించింది. ఆ తర్వాత కావేరి ట్రావెల్స్‌గా మారింది. కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూ డామన్‌లో తిరిగి రిజిస్ట్రేషన్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తే అధికారులు కొంత కఠినంగా ఉంటారన్న అంచనాతో డయ్యూ డామన్‌లో రిజిస్ట్రేషన్ చేశారు. వాస్తవానికి ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉంది. డయ్యూ డామన్‌లో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకున్న కావేరి ట్రావెల్స్ ఒడిశాలోని రాయగఢ్‌లో ఆల్టేషన్, ఫిట్నెస్ చేయించుకున్నారు.

బస్సు ప్రమాద మృతదేహాలు అప్పగింత పూర్తి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాల అప్పగింత సోమవారం పూర్తయింది. ఆదివారం రాత్రికి 18 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించగా సోమవారం ఉదయం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ (29) మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కర్నూలు తహశీల్దార్ ఆంజనేయులు, పోలీసుల సమక్షంలో కర్నూలు స్మశాన వాటికలో ప్రశాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం ప్రమాదం జరగగా అదే రోజు అర్ధరాత్రి రెండు గంటల వరకు 16 వైద్య బృందాలు మృతదేహాలకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించాయి. బంధువుల డిఎన్ఎ తీసుకుని అదే రోజు పరీక్ష నిమిత్తం మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆదివారం ఉదయం డిఎన్ఎ రిపోర్టులు రావడంతో మృతదేహాలను బంధువులకు అప్పగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. డిఎన్ఎ రిపోర్టుల మ్యాచింగ్ ప్రకారం మృతదేహాలను వారివారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎన్ఐఆర్ కాపీ, డెత్ సర్టిఫికెట్, పోర్టుమార్టం నివేదికలను అందజేశారు.

కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాల్సిందే

- సిపిఎం ప్రదర్శన, బైక్ ర్యాలీ
- తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - తిరువూరు, గంపలగూడెం



తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు, ప్రజలు

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై నూతన హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ప్రదర్శన, బైక్ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయంలోనే ప్రజలు పెద్ద ఎత్తున బైఠాయించి నిరసన తెలిపారు. వంతెన కూలిపోయి ఎనిమిదేళ్లవుతున్నా నూతన హై లెవల్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రయాణాలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో తక్షణం హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యాన 'చలో తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం' చేపట్టి బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత బ్రిడ్జి కుప్పకూలిన ప్రదేశం నుంచి తోటమూల మీదుగా గంపలగూడెం సాయిబాబా గుడి వరకు ఆయా గ్రామాల ప్రజలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. అక్కడి నుండి తిరువూరు మధిర రోడ్డు వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. తిరువూరు మెయిన్ రోడ్డు గుండా సాగి ఆర్‌డిఒ కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలోనే ధర్నా చేపట్టారు. ప్రభుత్వం మొండి వైఖరిని వీడి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ఆందోళనకారులు చేసిన నినాదాలతో ఆర్‌డిఒ కార్యాలయం మారుమోగింది. దీంతో సిపిఎం నేతలతో ఆర్‌డిఒ మాధురి తన ఛాంబర్‌లో చర్చలు జరిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, పి.వి.ఆంజనేయులు, సీనియర్ నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి, గువ్వల సీతారామిరెడ్డి, గంపలగూడెం మండల కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఆర్‌డిఒతో చర్చలు జరిపారు. సమస్య తీవ్రంగానే ఉందని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, ప్రభుత్వంతో కలెక్టర్ మాట్లాడుతున్నారని, వర్షాలు అధికంగా కురవడం, తెలంగాణ నుండి వరద ఎక్కువగా వస్తుండడంతో కట్టలేరు వాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మించలేకపోతున్నామని, 15 రోజుల్లో తాత్కాలిక రోడ్డును నిర్మిస్తామని సిపిఎం నేతలకు ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. డిసెంబర్ మొదటి వారం నాటికి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలవని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సిపిఎం నేతలు హెచ్చరించారు.

కర్నూలు ప్రమాదంపై వైసిపి దుష్ప్రచారం

- టిడిపి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలు బస్సు ప్రమాదంపై వైసిపి, సాక్షి మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని టిడిపి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను విమర్శించొచ్చని, కానీ దుర్ఘటనలు, మరణాలపై రాజకీయం చేయడం దారుణమని అన్నారు. కర్నూలు బస్సు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన ప్రభుత్వం అన్ని సహాయక చర్యలు తీసుకుందన్నారు. వైసిపి మాత్రం శవ రాజకీయాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అర్ధరాత్రి బెల్టుషాపులు నడుస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. చనిపోయిన బైకర్ ప్రభుత్వ అనుమతి పొందిన లైసెన్స్‌డ్ దుకాణం నుంచి రాత్రి 8 గంటల సమయంలో కొనుగోలు చేసినట్లు తెలుస్తోందన్నారు. నిబంధనలు ప్రకారమే రాష్ట్రంలో మద్యం షాపులు నడుస్తున్నాయని చెప్పారు. బస్సుకు పర్మిట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ సరైనా పత్రాలు లేవని తప్పుడు కథనాలు రాస్తున్నారన్నారు.

రాత్రింబవళ్లూ మద్యం విక్రయాలు

- వైసిపి అధికార ప్రతినిధి శ్యామల విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నకిలీ మద్యం ప్రాణాలు తీసుకుంటోందని, వేళాపాళా లేకుండా రాత్రింబవళ్లూ విక్రయాలు జరుగుతున్నాయని వైసిపి అధికార ప్రతినిధి ఆరె శ్యామల విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కర్నూలు బస్సు ప్రమాదానికి కల్తీ మద్యమే కారణమని ఆరోపించారు. 20 మంది అమాయకుల మరణాల బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అర్ధరాత్రయినా బెల్టుషాపుల్లో మద్యం దొరుకుతోందని, బస్సు ప్రమాదం తరువాత లక్ష్మీపురం బెల్టుషాపు మూసేశారని తెలిపారు. అక్కడ మద్యం తాగిన మత్తులోనే హైవేపై బైకర్‌కు ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. అందువల్లే సిపి ఫుటేజీ ఇవ్వడానికి ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు.

పోరాట ఫలితమే కాలపరిమితి చట్టం రద్దు

- విఒఎల అక్రమ తొలగింపులు ఆపాలి
- పొదుపు మహిళల ఉత్పత్తులకు మార్కెట్ చూపించాలి : కె ధనలక్ష్మి
- నంద్యాలలో విఒఎల సంఘం రాష్ట్ర 5వ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విఒఎల పోరాట ఫలితంగానే మూడు సంవత్సరాల కాల పరిమితి చట్టాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని ఎపి విఒఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పేర్కొన్నారు. విఒఎల జీవన ప్రమాణాలు మెరుగు పడాలంటే కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎపివిఒఎల సంఘం రాష్ట్ర 5వ మహాసభలు సోమవారం నంద్యాలలోని జెకెఫంక్షన్ హాల్‌లో ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. ముందుగా విఒఎల సంఘం సీనియర్ నాయకురాలు ఎ నిర్మలమ్మ జెండాను ఆవిష్కరించారు. సిహెచ్ రూపదేవి, పి మహేష్, కృష్ణమ్మ, శ్రీదేవి అధ్యక్షవర్గంగా వ్యహరించిన మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎ నాగరాజు ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను టిడిపి కూటమి ప్రభుత్వం వేగవంతంగా ప్రయివేటీకరణ వైపు తీసుకెళ్తోందని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చుతూ కార్మిక, ఉద్యోగ వర్గాలను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో కార్మిక చట్టాల సవరణ పేరు మీద పార్లమెంటులో బిల్లు పెడితే రాష్ట్రంలోని టిడిపి, వైసిపిలు పోటీ పడి మోడీకి అనుకూలంగా ఓటు



జెండాను ఎగురవేస్తున్న సీనియర్ నాయకురాలు నిర్మలమ్మ

వేశారంన్నారు. గత కార్యక్రమాల నివేదికను ధనలక్ష్మి ప్రవేశపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విఒఎలపై రాజకీయ జోక్యం పెరిగిపోతుందన్నారు. గ్రామ ఐక్య సంఘాల తీర్మానం లేకుండా, పొదుపు గ్రూపులను గుప్పెట్లో పెట్టుకొని గ్రామ స్థాయి నాయకులు ఇష్టానుసారంగా విఒఎల తొలగింపునకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

25 ఏళ్లుగా పని చేస్తున్న విఒఎలకు నేటికీ కనీస వేతనాలను పెంచకపోవడం శోచనీయమన్నారు. వేతనాలు పెంచాలని అడిగితే విఒఎలు ప్రభుత్వ ఉద్యోగులు కాదని ప్రభుత్వం దాటవేస్తుందని, ప్రభుత్వ సభలకు మాత్రం జనాన్ని కదిలించడం కోసం వారి అవసరం వస్తుందా అని ప్రశ్నించారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయన్నారు. మహిళా సాధికారత పేరుతో లక్షల రూపాయల లోన్లు ఇస్తున్నట్లు పేపర్ ప్రకటనలు తప్ప ఆచరణలో నామమాత్రపు రుణాలే ఇస్తున్నారన్నారు. మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులకు అమ్ముకోవడానికి మార్కెట్ చూపించాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్యమౌతుందని పేర్కొన్నారు. ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే కనీస వేతనం రూ.26 వేలు ఉండాలని నివేదికలు చెబుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలపై విఒఎలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహాసభలో రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి ఏసురత్నం, విఒఎల సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతయ్య, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు

- నేతలకు మంత్రి లోకేష్ సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తుపాను ప్రభావం అధికంగా ఉండే నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. సచివాలయంలోని ఆర్‌టిజిఎస్ కార్యాలయంలో మొంథా తుపానుపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటే అవకాశం ఉన్నందున ఈ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సాయం అందించాలని చెప్పారు. భారీ వర్షాల కారణంగా చెరువు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. తుపాను బాధితులకు ఎటువంటి సాయం అవసరమైనా వెంటనే స్పందించేందుకు యంత్రాంగం నిరంతరం సిద్ధంగా ఉంటుందని వెల్లడించారు.

బ్రాండిక్స్‌ను ఆదుకునేందుకు చర్యలు ఆ కంపెనీ డైరెక్టర్ దొరస్వామికి మంత్రి లోకేష్ హామీ

ట్రంప్ అదనపు టారిఫ్‌ల కారణంగా తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్న బ్రాండిక్స్ ఇండియా సంస్థను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆ కంపెనీ ఇండియా డైరెక్టర్ పిసి దొరస్వామికి హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్‌ను దొరస్వామి సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 50 శాతం వరకు టారిఫ్‌లు విధించడం వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ప్రభుత్వం తరపున మూడు అంశాల్లో బ్రాండిక్స్ ఇండియా సంస్థకు సహకారం కావాలని కోరారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించి ఉపశమన చర్యలు తీసుకుంటామని లోకేష్ చెప్పారు. బ్రాండిక్స్ సంస్థలో ఉపాధి అవకాశాలకు ఎటువంటి నష్టం కలగకుండా అత్యవసరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని తెలిపారు.

గిరిజనులకు త్వరలో దోమతెరలు

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎంపిక చేసిన గిరిజనుల కుటుంబాలకు 89,845 దోమతెరలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దోమల ద్వారా వచ్చే మలేరియా జ్వరాల వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా వీటిని అందించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్లలో అధికంగా నమోదైన మలేరియా జ్వరాల కేసుల ప్రాతిపదికన రెండు జిల్లాల్లో ఎంపిక చేసిన 743 గ్రామాల్లోని గిరిజనులకు అందజేస్తామని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 26,338, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 63,507 దోమతెరలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. వీటి ద్వారా సుమారు 2 లక్షల మంది గిరిజనులు ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. ఈ దోమతెరల కొనుగోలుకు రూ.2.30 కోట్లు వరకు వ్యయం కావొచ్చునని అంచనా వేసినట్లు తెలిపారు. మొంథా తుపాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ప్రసవ తేదీకి వారం రోజుల వ్యవధి కలిగిన 787 మంది గర్భిణులను సమీప ఆస్పత్రులకు తరలించామని మరో ప్రకటనలో మంత్రి వెల్లడించారు.

పట్టాదారు ఆధార్ సీడింగ్‌పై సర్వీస్ ఛార్జీ మినహాయింపు

- జిఓ ఆర్‌టి నెంబరు 396 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టాదారు ఆధార్ సీడింగ్‌పై ప్రభుత్వం సర్వీస్ ఛార్జీ మినహాయింపునిచ్చింది. ఈ మేరకు రెవెన్యూశాఖ జిఓ ఆర్‌టి నెంబరు 396ను సోమవారం విడుదల చేసింది. అన్నదాత-సుఖీభవ పథకం కింద ధ్రువీకరించిన రైతులకు మాత్రమే సర్వీస్ ఛార్జీ మినహాయింపు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 5.44 లక్షల మంది రైతులకు సంబంధించిన వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో తప్పుల కారణంగా అన్నదాత-సుఖీభవ పథకం అందుకోలేకపోయినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆధార్ సీడింగ్ సవరణకు తీసుకునే ఛార్జీ రూ.50లను మినహాయింపునివ్వడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రూ.2.72 కోట్లు మినహాయింపునిచ్చినట్లవుతుందని జిఓలో పేర్కొంది. ఈ సదుపాయం కేవలం ఆధార్ సీడింగ్ కాకుండా పలు కారణాలతో తహశీల్దార్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న పట్టాదారులు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం 76,060, విజయనగరం 74,155, తిరుపతి 58,557, ప్రకాశం 42,578, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ 38,448, అన్నమయ్య 25,313, అనకాపల్లి 23,163, బాపట్ల 20,849, కృష్ణా 17,175, చిత్తూరు 16,608, పల్నాడు 16,268, కాకినాడ 15,955, వైఎస్‌ఆర్ కడప 15,438, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు 14,482, నంద్యాల 14,477, ఏలూరు 11,519, ఎఎస్‌ఆర్ 11,519, ఎన్‌టిఆర్ 9,879, గుంటూరు 7,454, పార్వతీపురం మన్యం 7,000, శ్రీసత్య సాయి 6,274, అనంతపురం 4,278, కర్నూలు 4,189, తూర్పుగోదావరి 3,989, పశ్చిమగోదావరి 3,630, విశాఖపట్నం 3,188 పట్టాదారు ఖాతాలు ఆధార్ సీడింగ్ కాకుండా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఉన్నత స్థాయి స్వతంత్ర కమిటీతో విచారణ చేయించాలి

- కర్నూలు ప్రమాద ఘటనపై హెచ్‌ఆర్‌సికి తమిళనాడు తెలుగు యువశక్తి ఫిర్యాదు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై ఉన్నత స్థాయి స్వతంత్ర కమిటీతో విచారణ చేయించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు తమిళనాడు తెలుగు యువశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ఫిర్యాదు చేశారు. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, భారత జాతీయ రహదారుల అథారిటీ ప్రత్యక్ష పర్యవేక్షణలోని వాహన భద్రత, రహదారి మౌలిక సదుపాయాలు, అమలులో తీవ్ర వైఫల్యాలను కర్నూలు ప్రమాదం నొక్కి చెబుతోందని పేర్కొన్నారు. నియంత్రణా లోపాలు దర్యాప్తు చేయడానికి, నేర, సాంకేతిక బాధ్యతను పరిష్కరించడానికి, ప్రజా నివేదికను సమర్పించడానికి 15 రోజుల్లోపు మోర్త్, ఫోరెన్సిక్ నిపుణులు, బాధితుల ప్రతినిధులతో ఉన్నత స్థాయి స్వతంత్ర విచారణను ఏర్పాటు చేయాలని కోరారు. 2025-26 బడ్జెట్ నిధులతో 90 రోజుల్లోపు అగ్ని నిరోధక వ్యవస్థలు, అత్యవసర మానిటరింగ్ స్పీడ్ కెమెరాలను ఏర్పాటు చేయాలని దేశవ్యాప్తంగా బస్సు ఆడిట్‌లను, కార్గో స్క్రీనింగ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా పరిహారం అందించాలని కోరారు. ప్రమాద రహిత కారిడార్‌లను అమలు చేయడానికి రాష్ట్రాలు, యుటి(కేంద్రపాలిత ప్రాంతాలు)లతో అత్యవసర సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు.

అమరరాజా ఎనర్జీ సిబిఒగా చంద్రశేఖర్ రాధాక్రిష్ణన్

హైదరాబాద్ : ప్రముఖ బ్యాటరీ ఉత్పత్తుల కంపనీ అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ నూతన చీఫ్ బిజినెస్ ఆఫీస్ (సిబిఒ)గా చంద్రశేఖర్ రాధాక్రిష్ణన్ నియమితులయ్యారు. ఆయన భారత్, సార్క్ రీజియన్ బాధ్యతలను చూడనున్నారు. ఇంతక్రితం హీరో మోటో కార్ప్‌లో బిజినెస్ గ్రోత్ హెడ్‌గా పని చేసి తాజాగా అమరరాజాలో చేరారు. చంద్రశేఖర్ పలు ఎఫ్‌ఎంసిజి, ఇవి, టెలికం రంగాల కంపెనీల్లో పని చేశారు.


అంబేద్కర్ స్మృతివనంపై నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ

రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- దళిత, గిరిజన ప్రజా సంఘాలు హెచ్చరిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనం నిర్వహణ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న దుర్మార్గమైన కులదురహంకార వైఖరికి నిరసనగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని దళిత, గిరిజన ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), దళిత గిరిజన ప్రజా సంఘాల నాయకులు కలిసి సామాజిక న్యాయ మహాశిల్పం (అంబేద్కర్ స్మృతివనం) ఆవరణను సోమవారం సందర్శించారు. చెత్తాచెదారం, వ్యర్థాలతో కూడిన అక్కడి పరిసరాలు, పరిస్థితులను చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. సామాజిక స్ఫూర్తి మహా శిల్పం ఆవరణ నిర్వహణను ప్రభుత్వం గత 16 నెలలుగా గాలికి వదిలేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రపంచానికి దశ దిశ చూపిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదన్నారు. జై భీమ్‌రావు భారత్ పార్టీ అధికార ప్రతినిధి కొండలరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచే అంబేద్కర్ మహా శిల్పానికి విద్యుత్ దీప కాంతులు లేకుండా చీకటి మయం చేశారన్నారు. డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయ మహా శిల్పం ఆవరణ నిర్వహణ కోసం గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు సమ్మె చేస్తున్నారని తెలిపారు.



అంబేద్కర్ మహాశిల్పం వద్ద ఆందోళన చేస్తున్న నేతలు, ఇన్‌సెట్‌లో వ్యర్థాలతో ఉన్న స్మృతివనం

పారిశుధ్య కార్మికుల సమ్మెకు మద్దతు

జీతాల బకాయిల కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనం పారిశుధ్య కార్మికులు ఈ నెల 3వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు అండ్ర మాల్యాద్రి చెప్పారు. పారిశుధ్య బాధ్యతలు తీసుకున్న ఏజెన్సీ నిర్వాహకులు కేవలం ఒక నెల మాత్రమే జీతాలు చెల్లించారని, ఇంకా 8 నెలల జీతాల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. పారిశుధ్య కార్మికుల సమ్మెకు డిహెచ్‌పిఎస్ నాయకులు పేరయ్య, జై భీమ్ రావు భారత్ పార్టీ నాయకులు కొండలరావు, సుమమాల సంస్థ షాలేం రాజు, గిరిజన నాయకులు మల్లి భాస్కరరావు, విసికె నాయకులు అన్నవరపు సుధీర్, అంబేద్కరిస్ట్ మనోజ్, జి నగేష్, పి సుధీర్ తదితర సంస్థలు మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో చింతా వెంకటేశ్వర్లు, సురేష్, జి యోహాను, మేరి, ధనలక్ష్మి, సత్యవతి, సావిత్రి, మల్లిక పాల్గొన్నారు.

ఇండియన్ ఆయిల్ లాభాల్లో 40 రెట్ల వృద్ధి

- క్యూ2లో రూ.7,610.45 కోట్ల మిగులు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ బంఫర్ లాభాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 40 రెట్లు (4,120 శాతం) వృద్ధితో రూ.7,610.45 కోట్ల నికర లాభాలు సాధించింది. రిఫైనింగ్ మార్జిన్లు పెరగడం, అంతర్జాతీయంగా చమురు ధరల్లో తగ్గుదల కంపెనీ ఆర్థిక ఫలితాలకు ప్రధాన మద్దతును అందించాయి. 2024-25 ఇదే సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.180 కోట్ల లాభాలను ప్రకటించింది. 2025-26 ప్రథమార్థంలో కంపెనీ సగటు స్థూల రిఫైనింగ్ మార్జిన్లు బ్యారెల్‌కు 55 శాతం పైగా పెరిగి 6.32 డాలర్లుగా నమోదయ్యిందని తెలిపింది. 2024-25 ప్రథమార్థంలో ఇది 4.08 డాలర్లుగా ఉంది. ఇదే సమయంలో రిఫైనరీ లాభాలు కేవలం రూ.180 కోట్లుగా ఉన్నాయి. గడిచిన క్యూ2లో కంపెనీ రిఫైనరీ రెవెన్యూ 4.07 శాతం పెరిగి రూ.2.04 లక్షల కోట్లకు చేరింది. దేశీయ చమురు అమ్మకాలు 4.2 శాతం పెరిగి 22,851 మిలియన్ మెట్రిక్ టన్నులుగా చోటు చేసుకుంది. మంగళవారం బిఎస్‌ఇలో ఇండియన్ ఆయిల్ సేర్ 3.19 శాతం పెరిగి రూ.155.15 వద్ద ముగిసింది.



పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లాభాల్లో 24 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 24 శాతం వృద్ధితో రూ.582 కోట్ల నికర లాభాలు సాధించింది,. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.470 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,880 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం..

గడిచిన క్యూ2లో రూ.2,131 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.2,017 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,780 కోట్ల ఎన్‌ఐఐ చోటు చేసుకుంది. స్థూల నిరర్థక ఆస్తులు 1.24 శాతం నుంచి 1.04 శాతానికి తగ్గాయి.

విఐకి సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ : ఆర్థిక సంక్షోభంలో ఉన్న వొడాఫోన్ ఐడియా (విఐ)కి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2016-17 వరకు బకాయిల కోసం టెలికాం విభాగం (డాట్) ఇచ్చిన అదనపు పన్ను డిమాండ్‌లపై కంపెనీ చేస్తోన్న అభ్యంతరాలను పరిశీలించేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. డాట్ తాజా పన్ను డిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ విఐ వేసిన పిటిషన్‌పై కోర్టు తాజా ఉత్తర్వులు ఇచ్చింది. 2016-17 కాలానికి రూ.5,606 కోట్ల అదనపు పన్ను చెల్లించాలని డిఒటి డిమాండ్ చేసింది. అదే విధంగా 2018-19 వరకు ఐడియా సెల్యులార్ గ్రూప్, వొడాఫోన్ ఐడియా కోసం లైసెన్సు ఫీజు బకాయిల మొత్తాన్ని కూడా సవరించింది. దీనిపై విఐ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ఎజిఆర్ బకాయిలపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు పరిధిని దాటి డాట్ పన్ను డిమాండ్ చేస్తోందని కంపెనీ వాదించింది.



పుదుచ్చేరిలో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సు సేవలు

- ప్రారంభించిన లెఫ్టినెంట్ గవర్నర్ కైలాసనాథన్, సిఎం రంగసామి

హైదరాబాద్ : ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ (ఒజిఎల్) తమ విద్యుత్ బస్సు సేవలను పుదుచ్చేరిలోనూ అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇక్కడ ఎలక్ట్రిక్ బస్సులు ప్రజలకు సేవలను ఒలెక్ట్రా తయారు చేసిన బస్సులతోనే ప్రారంభించడం విశేషమని ఆ సంస్థ తెలిపింది. తమ 25 బస్సులను పుదుచ్చేరి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (పిఆర్‌టిసి) సోమవారం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని పేర్కొంది. ఈ బస్సులను లెఫ్టినెంట్ గవర్నర్ కె కైలాశ్‌నాథన్, ముఖ్యమంత్రి ఎన్ రంగసామి, సభాపతి ఆర్ సెల్వంలు అధికార అనధికార ప్రముఖుల సమక్షంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఎలక్ట్రిక్ బస్సులను మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఎల్) గ్రూప్ సంస్థ ఇవి ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జిసిసి) విధానంలో 12 సంవత్సరాలపాటు నడిపించటంతో పాటు మెయింటెనెన్స్ చేస్తుందని ఓలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఎండి మహేష్ బాబు తెలిపారు.

తిరుమల పరకామణి చోరీ కేసు సిఐడికి అప్పగింత

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసును సిఐడితో పాటు ఎసిబికి రాష్ట్ర హైకోర్టు అప్పగించింది. రవికుమార్ అనే ఉద్యోగి దొంగతనం చేస్తూ పట్టుబడితే.. ఆ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేశారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అసలు పరకామణి చోరీ కేసును ఎలా రాజీ చేశారు? దీని వెనుక ఎవరు ఉన్నారు? నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు రాజీ చేశారు? దీని వెనుక లోగుట్టేమిటో తేల్చాలని సిఐడిని ఆదేశించింది.

రవికుమార్‌కు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, ఆస్తుల లావాదేవీలు, ఎంత కాలం నుంచి చోరీకి పాల్పడ్డారు? ఆయన ఆస్తులు ఎవరెవరి పేరు మీదకు మారాయన్న అంశంపై దర్యాప్తు చేయాలని ఎసిబిని ఆదేశించింది. సిఐడి, ఎసిబిలు దర్యాప్తును పూర్తి చేసి తదుపరి విచారణను డిసెంబర్ రెండు కల్లా నివేదికలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా డిజి స్థాయి అధికారి ఉండాలని స్పష్టం చేసిది.

ముంబయిలో 'ఇండియా మారిటైమ్ వీక్'

- పాల్గొనున్న మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముంబయిలో నిర్వహించనున్న ఇండియా మారిటైమ్ వీక్ - 2025లో రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి పాల్గొనున్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ముంబయికి పయనమయ్యారు. ముంబయిలోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ నెల 31వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వశాఖ నేతృత్వంలో నిర్వహిస్తుంది. వందకు పైగా దేశాల భాగస్వామ్యం, 500లకు పైగా ఎగ్జిబిటర్లు, రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి అవకాశాలతో అతిపెద్ద ప్రపంచ మారిటైమ్ సమావేశాల్లో ఒకటిగా నిలవనుందని నిర్వాహకులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా మారిటైమ్ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన ప్రాజెక్టులు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన విధానపరమైన పాలసీలు, పోర్టులు, షిప్పింగ్, లాజిస్టిక్స్, పర్యాటకం, అనుబంధ రంగాల్లో వ్యూహాత్మక పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించేందుకు ప్రత్యేకంగా రాష్ట్ర పెట్టుబడి సెషన్‌ను నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు. ఎపి స్టేట్ పెవిలియన్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

గెట్ ఎ వేలో హెరిటేజ్ ఫుడ్స్‌కు మెజారిటీ వాటా

హైదరాబాద్ : ఐస్‌క్రీమ్ బ్రాండ్ గెట్ ఎ వే బ్రాండ్ ఉత్పత్తులను అందించే పీనట్‌బట్టర్ అండ్ జెల్లీ ప్రయివేటు లిమిటెడ్‌లో ప్రముఖ డెయిరీ కంపెనీ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ మెజారిటీ వాటాను స్వాధీనం చేసుకుంది.

రూ.9 కోట్లతో 51 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు పేర్కొంది. బోర్డు ఆమోదం తర్వాత 45 రోజుల్లో ఈ స్వాధీనం పూర్తి కానుందని హెరిటేజ్ ఫుడ్స్ సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. గెట్ ఎ వేలోని మిగితా 49 శాతం వాటా ప్రమోటర్లు కలిగి ఉంటారని తెలిపింది. 2026 మార్చి తర్వాత మరో 20 శాతం వాటాను హెరిటేజ్ ఫుడ్స్ స్వాధీనం చేసుకోనున్నట్లు పేర్కొంది. 2030 నాటికి తమ సంస్థను అత్యంత విలువైన డెయిరీ న్యూట్రిషన్ కంపెనీగా నిలుపడానికి గెట్ ఎ వే స్వాధీనం కలిగి రానుందని హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు. ఈ భాగస్వామ్యం తమ సంస్థకు ఓ మైలురాయి కానుందని గెట్ ఎ వే కో ఫౌండర్, సిఇఒ జాష్ షా పేర్కొన్నారు.

పిఎల్ క్యాపిటల్ గ్రూపు సిఇఒగా జరీస్ దారువాలా



ముంబయి : ఆర్థిక సేవల సంస్థ పిఎల్ క్యాపిటల్ గ్రూప్ నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా జరీస్ దారువాలా నియమితులయ్యారని ఆ సంస్థ తెలిపింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో గొప్ప నాయకురాలిగా పేరుగాంచిన జరీన్ దారువాలా, కార్పొరేట్, రిటైల్ బ్యాంకింగ్, గవర్నెన్స్, వ్యూహాత్మక నాయకత్వం వంటి విభాగాల్లో 35 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవాన్ని కలిగి ఉన్నారని పేర్కొంది. పిఎల్ క్యాపిటల్‌లో చేరడానికి ముందు ఆమె స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్‌లో భారత్, దక్షిణ ఆసియా సిఇఒగా పని చేశారు.

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి కొత్త ఎన్‌ఎఫ్‌ఒ

ముంబయి : యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా యాక్సిస్ ఇన్‌కం ప్లస్ అర్బిటేజ్ పాసీవ్ ఎఫ్‌ఒఎఫ్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ నూతన ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌ఒ) అక్టోబర్ 28న సబ్‌స్క్రిప్షన్‌కు తెరుబడుతుందని.. నవంబర్ 11న ముగుస్తుందని పేర్కొంది. ఇందులోని 65 శాతం నిధులను నిఫ్టీ షార్ట్ డ్యూరేషన్ డెట్ ఇండెక్స్‌లో, 35 శాతం నిధులను నిఫ్టీ 50 అర్బిటేజ్ టిఆర్‌ఐలో పెట్టుబడిగా పెట్టనున్నట్లు తెలిపింది. ఇందులో రిస్కు తక్కువగా ఉంటుందని యాక్సిస్ ఎఎంసి ఎండి, సిఇఒ బి గోప్‌కుమార్ తెలిపారు.

సంపాదకీయం

'దోస్త్ మేరా దోస్త్'!

'వడ్డించే వాడు మనవాడైతే..' అన్న సామెత అందరికీ తెలిసిందే! ఏలినవారి దోస్తులకు అడ్డదారిన ఎంత లబ్ధి జరుగుతుందో వెల్లడించే తాజా ఉదంతమే ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థయైన భారత జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసి)ని అదానీ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం బలిపెట్టడం. కోట్లాదిమంది పాలసీదారుల, ఉద్యోగుల, అధికారుల ప్రయోజనాలను అదానీ వ్యాపార కాంక్షకు సమిధలు చేయడం అమానుషం. సామాన్యుల చెమట చుక్కలే పెట్టుబడిగా ఎదిగిన ఎల్‌ఐసికి చెందిన వేల కోట్ల రూపాయల మొత్తాన్ని అదానీ గ్రూపునకు గుట్టుచప్పుడు కాకుండా మళ్లించేందుకు అత్యున్నత స్థాయిలో కుట్ర జరిగింది. అమెరికా నుండి వెలువడే 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఈ కథనం తొలుత రావడం గమనార్హం. అంతర్జాతీయంగా విత్తసంస్థలు అదానీకి అప్పులు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 3.9 మిలియన్ డాలర్లు (33 వేల కోట్ల రూపాయలను) అదానీ గ్రూపునకు మళ్లించడానికి సిద్ధమైందని ఆ వార్తా కథనంలో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే అదానీ పోర్ట్స్ అనుబంధ సంస్థ రుణాల రీఫైనాన్స్ కోసం జారీ చేసిన 585 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.5,000 కోట్లు) బాండ్లను ఎల్‌ఐసి కొనుగోలు చేసింది. 'అదానీపై లంచం, మోసం ఆరోపణలపై అమెరికా కోర్టుల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అనేక అమెరికా, యూరోపియన్ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడాయి. కానీ.. భారత ప్రభుత్వం మాత్రం అదానీ కోసం ప్రత్యేక ఆర్థిక మద్దతు ప్రణాళికను రూపొందించింది' అని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్‌ఐసి నుండి పొందిన అంతర్గత పత్రాలు సహా అధికారులు, బ్యాంకర్లతో ఇంటర్వ్యూల ఆధారంగా ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపునకు ఏ విధంగా పాల్పడిందో గుర్తించామని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొందంటే పథకం ఎంత పకడ్బందీగా రూపొందించారో తేటతెల్లమవుతుంది.

అదానీ పోర్ట్సు అప్పటికే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం బాండ్లను జారీ చేయాలని నిర్ణయించుకున్న సమయంలోనే ఉన్నత స్థాయిలో ఎల్‌ఐసి నిధుల తరలింపునకు సంబంధించిన ప్రణాళిక సిద్ధమైంది. ఆ వెంటనే మే 30వ తేదీన అదానీ పోర్ట్సు విడుదల చేసిన మొత్తం బాండ్లను ఎల్‌ఐసి కొనేసింది. అదానీ గ్రూపు షేర్లు, బాండ్లు కొనడానికి విదేశీ విత్త సంస్థలేవీ సిద్ధం కాని నేపథ్యంలో భారత ప్రభుత్వరంగ బీమా సంస్థచేత కొనిపించి, అదానీ గ్రూపునకు విశ్వసనీయత కల్పించాలన్నదే ఆ పథకం. ఆ పాచిక పారింది కనుకనే అంతకు ముందు వెనక్కి తగ్గిన అమెరికా సంస్థ ఏథెన్ ఇన్సూరెన్స్ జూన్‌లో 750 మిలియన్ డాలర్లు (సుమారు రూ.6,650 కోట్లు) పెట్టుబడులు పెట్టింది. అందుకే 'అత్యంత ధనవంతుడు, రాజకీయంగా కేంద్ర ప్రభుత్వానికి బాగా అనుసంధానించబడిన శత కోటీశ్వరునికి చెందిన సంస్థకు దేశవ్యాప్తంగా ఉన్న పన్ను చెల్లింపుదారుల డబ్బును మళ్లించడానికి ప్రభుత్వం చేపట్టిన అతి పెద్ద ప్రణాళికలో ఇది ఒక భాగం.' అని వాషింగ్టన్ పోస్ట్ వ్యాఖ్యానించింది.

అదానీ ఆర్థిక అక్రమాలు, అవినీతిపై 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వరుస రిపోర్టులను విడుదల చేసింది. అదానీ కృత్రిమంగా తన కంపెనీల షేర్లను పెంచుకుంటున్నారని.. డొల్ల కంపెనీలతో పన్నులు ఎగ్గొడుతున్నారని విశ్లేషించింది. అదానీ కంపెనీలు ప్రమాదకర అప్పుల్లో ఉన్నాయని కూడా వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి తోడు తాజాగా వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ఇటు ప్రభుత్వ వర్గాల్లోనూ, అటు ఇన్వెస్టర్లు, కార్పొరేట్ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. అదానీ గ్రూపు పట్ల అవిశ్వాసం పెరగడానికి, దేశాధినేతకు, అనుంగు మిత్రునికిగల బలమైన బంధం అర్థం కావడానికీ దోహదపడింది. బహుశా దాన్ని కవర్ చేయడానికేనేమో అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని ఎల్‌ఐసి పేర్కొంది. బోర్డు ఆమోదించిన విధి విధానాల మేరకే తాము పెట్టుబడులు పెడతామని, వాటిపై తమదే తుది నిర్ణయమని గట్టిగా బుకాయించింది. కనుక జరిగిందేమిటో దేశ ప్రజలకు తెలపడం ప్రభుత్వ బాధ్యత. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించడం సబబైనది. అందుకోసం ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెంచాలి. పాలకులకు కార్పొరేట్లకుగల అపవిత్ర బంధం అర్థం చేసుకోవాలి.


మహనీయుల మాట



ఏ దేశంలోనైనా శాస్త్రీయ ఆలోచన యొక్క...కళల యొక్క చరిత్రను అర్థం చేసుకోవాలంటే...ఆ దేశ ర్థిక రంగం ఒక్కదాన్ని గురించి తెలుసుకుంటే సరిపోదు. అక్కడి ఆర్థిక రంగం నుంచి సామాజిక మానసిక స్థితి లోకి వెళ్లడమెలాగో నేర్చుకోవాలి.

- జి.వి. ప్లెఖనోవ్,
రష్యన్ విప్లవకారుడు,
మార్క్సిస్టు సిద్ధాంతవేత్త.

'బుడగలు'-నయా ఉదారవాదం



ప్రభాత్ పట్నాయక్


నయా ఉదారవాదం అనివార్యంగా మాంద్యానికి దారి తీస్తుంది. దీనికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది: ఆదాయాల్లో అసమానతలు పెరగడం. ఈ అసమానతలు అలా పెరుగుతూనే పోతాయి. పేదలు తమ ఆదాయాలను పూర్తిగా ఖర్చు చేస్తారు. కాని సంపన్నులు కొంతవరకే ఖర్చు చేసి తక్కినది దాచుకుంటారు. సంపన్నుల వాటా పెరుగుతున్నకొద్దీ వినిమయం కోసం మొత్తంగా సమాజంలో చేసే ఖర్చు తగ్గిపోతూ వుంటుంది. దాంతో మొత్తంగా మార్కెట్‌లో డిమాండ్ తగ్గిపోతూ వుంటుంది. అప్పుడు ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించడం జరగదు. దాని ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుంది. అది డిమాండ్‌ను మరింత తగ్గిస్తుంది. ఈ విధంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి దిగజారిపోతూ వుంటుంది.

నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి దేశాల సరిహద్దులను దాటి ప్రపంచం మొత్తం మీద సంచరిస్తూ వుంటుంది. ఎక్కడ చౌకగా కార్మికశక్తి లభిస్తూ వుంటుందో అక్కడికల్లా పోతుంది. మూడవ ప్రపంచ దేశాలలో వేతనాలు చాలా తక్కువగా ఉంటాయి. కనుక సంపన్న దేశాల నుండి పెట్టుబడి మూడవ ప్రపంచ దేశాలకి తరలిపోతుంది. దాని ఫలితంగా ప్రపంచం మొత్తం మీద చూసుకున్నప్పుడు కార్మికుల వేతనాల వాటా తగ్గిపోతూ, పెట్టుబడిదారుల లాభాల వాటా పెరుగుతూ వుంటుంది. అది ఆదాయాల్లో అంతరాలను నిరంతరం పెరుగుతూ వుండడానికి కారణం. పోనీ, ఆ మూడవ ప్రపంచ దేశాలలో నిరుద్యోగం ఏమైనా తగ్గుతుందా అంటే అదీ ఉండదు. నయా ఉదారవాద విధానాల ఫలితంగా రైతులకు, చేతివృత్తిదారులకు, చిన్న, మధ్యతరహా పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే సబ్సిడీలు, మద్దతు తగ్గిపోతాయి. దాంతో ఆ రంగాల నుండి చేతివృత్తిదారులు, రైతుకూలీలు తప్పుకుని ప్రత్యామ్నాయ జీవనోపాధి కోసం పట్టణాలకు తరలుతారు. దాంతో పట్టణాల్లో నిరుద్యోగం పెరుగుతుంది. అది మాత్రమే కాదు. నయా ఉదారవాద విధానాల వలన కొత్త సాంకేతిక పద్ధతులను చేపట్టి ఉత్పాదకతను పెంచడానికి పూనుకుంటారు. అందువలన కొత్తగా ఏర్పడే ఉద్యోగాలు చాలా పరిమితంగా ఉంటాయి. మరోపక్క ఉత్పాదకత పెరుగుతున్నకొద్దీ నిజవేతనాలు దానికి తగ్గట్టుగా పెరగవు. చౌకగా కార్మికశక్తి లభించడమే కారణం. అందువలన ఉత్పాదకత పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగకుండా వెనుకబడిపోతాయి. ఇదంతా ఆదాయాల్లో అసమానతల పెరుగుదలను వేగవంతం చేస్తుంది. అది నయా ఉదారవాద వ్యవస్థను మాంద్యం లోకి నెడుతుంది. ఇది మొదటి కారణం.

ఇక రెండో కారణం: జరుగుతున్న ఉత్పత్తికి అనుగుణంగా మార్కెట్‌లో డిమాండ్‌ను పెంచే దిశగా జోక్యం చేసుకోవడంలో ప్రభుత్వాల అశక్తత. ఆర్థిక మాంద్యం నుండి కోలుకోవడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవడం కీలకం అని జాన్ మేనార్డ్ కీన్స్ భావించాడు. అటువంటి జోక్యం ద్వారానే పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ నిరంతరాయంగా కొనసాగగలదని అతడు ఆశ పడ్డాడు. అలా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం అంటే ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచడం ద్వారా మాత్రమే సాధ్యం. ద్రవ్యలోటును పెంచడమో లేక సంపన్నుల మీద పన్నులను పెంచడమో చేస్తే తప్ప ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచడం సాధ్యపడదు. కాని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఈ రెండింటిలోనూ దేనినీ అంగీకరించదు. అందుచేత ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచడం నయా ఉదారవాద వ్యవస్థలో కుదరదు. ఇక్కడ కీన్స్ సూచించిన పరిష్కారం పనిచేయదు. మామూలుగా అయితే నయా ఉదారవాద వ్యవస్థలో మాంద్యం నుంచి కోలుకునే పరిష్కారం ఏదీ లేదు.

ఇక్కడ 'బుడగలు' నయా ఉదారవాదానికి అక్కరకు వస్తాయి. మార్కెట్‌లో జరిగే చట్టా వ్యాపారం లేదా స్పెక్యులేషన్ మార్కెట్‌లోని ఆస్తుల (షేర్లు, భూములు, ఫ్యూచర్లు వగైరాలు) ధరలను ఆకాశం అంటేలా పెంచుతుంది. వాటిలో పెట్టుబడులు పెడితే తమరు అధిక లాభాలు వస్తాయన్న ఆశ మదుపరుల్లో కలుగుతుంది. ఈ మదుపరులలో చాలామంది తమవద్ద ఉన్న సంపద వాస్తవంగానే పెరుగుతోందని, తాము సంపన్నులమైపోయామని భావిస్తూ వుంటారు. దాంతో వారు ఉత్సాహపడి ఎక్కువ విలాసవంతంగా ఖర్చు చేస్తూ వుంటారు. వారి ఆస్తుల విలువలో పెరుగుదల ఊహాజనితమే అయినా, వారు చేసే ఖర్చు మాత్రం వాస్తవమే. అందువలన మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతుంది. మాంద్యంలోకి ఆర్థిక వ్యవస్థ జారిపోకుండా తాత్కాలికంగానైనా నిలబెడుతుంది.

ఐతే ఇటువంటి 'బుడగలు' ఎటువంటి దీర్ఘకాలికమైన ఆర్థిక వృద్ధికీ దోహదం చేయలేవు. తాత్కాలికంగా ప్రభావం కలిగించగలవే తప్ప మాంద్యం నుండి కోలుకోడానికి తోడ్పడవు. వాటి తాత్కాలిక ప్రభావం ఉన్నతం కాలం ఆర్థిక వ్యవస్థ మాంద్యం నుండి కోలుకుంటున్నట్టు కనిపిస్తుంది. అదే విధంగా ఆ బుడగలు పేలిపోగానే ఒక్కసారి ఆర్థిక సంక్షోభం నెలకొంటుంది. ఈ బుడగలు ఏదో ఒక ఒక కొత్త రకం టెక్నాలజీతో తయారైన ఉత్పత్తి మార్కెట్ లో ప్రవేశించినప్పుడో, లేదా కొత్త తరహా ఉత్పత్తి విధానాన్ని ప్రవేశ పెట్టినప్పుడో ఎక్కువ ఆశలను రేకెత్తిస్తాయి. అది స్పెక్యులేషన్‌కు దారి తీస్తుంది. ఈ కొత్త టెక్నాలజీతో ఒరిగేదేమిటో తెలిసేలోపు స్పెక్యులేటర్లు ప్రవర్తించే తీరు మీదకు అందరి దృష్టీ మళ్ళుతుంది. ఆ జూదమే ప్రధానం అయిపోతుంది.



> **ఇటువంటి 'బుడగలు' ఎటువంటి దీర్ఘకాలికమైన ఆర్థిక వృద్ధికీ దోహదం చేయలేవు. తాత్కాలికంగా ప్రభావం కలిగించగలవే తప్ప మాంద్యం నుండి కోలుకోడానికి తోడ్పడవు. వాటి తాత్కాలిక ప్రభావం ఉన్నతం కాలం ఆర్థిక వ్యవస్థ మాంద్యం నుండి కోలుకుంటున్నట్టు కనిపిస్తుంది. అదే విధంగా ఆ బుడగలు పేలిపోగానే ఒక్కసారి ఆర్థిక సంక్షోభం నెలకొంటుంది. ఈ బుడగలు ఏదో ఒక ఒక కొత్త రకం టెక్నాలజీతో తయారైన ఉత్పత్తి మార్కెట్ లో ప్రవేశించినప్పుడో... లేదా కొత్త తరహా ఉత్పత్తి విధానాన్ని ప్రవేశ పెట్టినప్పుడో ఎక్కువ ఆశలను రేకెత్తిస్తాయి. అది స్పెక్యులేషన్‌కు దారి తీస్తుంది. ఈ కొత్త టెక్నాలజీతో ఒరిగేదేమిటో తెలిసేలోపు స్పెక్యులేటర్లు ప్రవర్తించే తీరు మీదకు అందరి దృష్టీ మళ్ళుతుంది. ఆ జూదమే ప్రధానం అయిపోతుంది.**

జోసెఫ్ షుంపీటర్ అనే ఆస్ట్రో-అమెరికన్ ఆర్థికవేత్త కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టిన ఫలితంగా మాంద్యం నుండి కోలుకోడానికిగల అవకాశాలను సరిగ్గానే అంచనా వేశాడు. కాని, దాని ఫలితంగా జరిగే అధికోత్పత్తి విషయంలో ఘోరంగా తప్పుడు నిర్ధారణలకు వచ్చాడు. కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టిన కారణంగా వస్తువుల ధరలు తగ్గిపోతాయని అనుకున్నాడే తప్ప ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయని అతడు అంచనా వేయలేదు. ఆర్థిక వ్యవస్థలో దాదాపు అందరికీ ఉపాధి అవకాశాలు ఎప్పుడూ లభిస్తూనే వుంటాయన్న అవగాహనతోటే అతడు వ్యవహరించాడు. అందువలన ఒకసారి బుడగ ప్రభావం తగ్గి అది చప్పబడ్డాక అప్పటికే పెరిగిన ఉత్పాదక ఫలితంగా కార్మికులకు మెరుగైన జీతాలు, చవకగా సరుకులు లభిస్తాయని అతడు నిర్ధారించాడు. ఈ నిర్ధారణ ఊహాజనితేమే కాని వాస్తవం కాదు. ఎలాగో చూద్దాం.

నయా ఉదారవాద కాలంలో ఇప్పటివరకూ రెండు బుడగలు వచ్చాయి. మొదటిది డాట్ కామ్ బబుల్. ఇది 1990 దశకంలో వచ్చింది. రెండవది హౌసింగ్ బబుల్. ఇది మొదటి బబుల్ తర్వాత వచ్చింది. ఈ రెండూ అమెరికాలోనే వచ్చాయి. హౌసింగ్ బబుల్ పేలిపోయిన తర్వాత దీర్ఘకాలంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో కూరుకుపోయింది. ఈ బుడగలు పేలిపోవడం ఆ మాంద్యాన్ని మరింత ముదరబెట్టింది కూడా. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం 1981 వరకూ సాధించిన వృద్ధిరేట్లతో పోల్చితే 1982-91, 1992-2001, 2002-2011 దశకాల్లో వృద్ధిరేటు తగ్గిపోయింది. ఆ తర్వాత ఈ రెండు బుడగలూ ఏర్పడి పేలిపోయాయి. ఆ తర్వాత కాలంలో (కరోనా ఫలితంగా వచ్చిన సంకట స్థితి నుండి బైటపడ్డాక) ఉన్న వృద్ధిరేటు అంతకన్నా తక్కువగా ఉంది.

ఇప్పుడు ఎ.ఐ టెక్నాలజీని ప్రవేశ పెట్టడం ద్వారా నెలకొంటున్న కొత్త బుడగ ఇప్పుడున్న మాంద్యం నుండి ఆర్థిక వ్యవస్థను బైటపడవేస్తుందన్న ఆశలు కొంతమందిలో నెలకొంటున్నాయి. ఈ సారి ఎ.ఐ బుడగ నిలకడగా, పేలిపోకుండా అలాగే కొనసాగుతుందన్న ఆశలూ దాంతోబాటే ఏర్పడుతున్నాయి. ఆర్థిక కొలతల ప్రకారం ఎ.ఐ బుడగ సైజు పెద్దదే. కాని వాస్తవ ఆర్థిక వ్యవస్థ మీద దాని ప్రభావం మాత్రం చాలా తక్కువగా ఉంటుంది. ఇక్కడ రెండు అంశాలను మనం గమనించాలి.

మొదటిది: ఎ.ఐ ప్రభావం అమెరికా ఆర్థిక వ్యవస్థ మీద సానుకూలంగానే పడినప్పటికీ, దాని ప్రభావం నామమాత్రంగానే ఉంది. ఎ.ఐ ప్రవేశపెట్టిన తర్వాత కూడా అమెరికాలో దాని ప్రభావం యువజనుల నిరుద్యోగాన్ని తగ్గించలేదు. 2024 జులైలో అక్కడ యువత నిరుద్యోగం 9.8 శాతం ఉంటే, 2025 జులైలో అది 10.8 శాతానికి పెరిగింది. అంటే ఎ.ఐ వలన ఉపాధి అవకాశాల పెరుగుదల పెద్దగా లేదని స్పష్టం అవుతోంది.

> **నయా ఉదారవాద విధానాల వలన కొత్త సాంకేతిక పద్ధతులను చేపట్టి ఉత్పాదకతను పెంచడానికి పూనుకుంటారు. అందువలన కొత్తగా ఏర్పడే ఉద్యోగాలు చాలా పరిమితంగా ఉంటాయి. మరోపక్క ఉత్పాదకత పెరుగుతున్నకొద్దీ నిజవేతనాలు దానికి తగ్గట్టుగా పెరగవు. చౌకగా కార్మికశక్తి లభించడమే కారణం. అందువలన ఉత్పాదకత పెరుగుదలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగకుండా వెనుకబడిపోతాయి. ఇదంతా ఆదాయాల్లో అసమానతల పెరుగుదలను వేగవంతం చేస్తుంది. అది నయా ఉదారవాద వ్యవస్థను మాంద్యంలోకి నెడుతుంది.**

రెండవది: ఎ.ఐ బుడగ పేలిపోవడం అనివార్యం. ఏ బుడగ అయినా పేలిపోవలసిందే. అలా పేలిపోయిన తర్వాత అమెరికాలో నిరుద్యోగం గణనీయంగా పెరిగిపోవడం తథ్యం. ఒక కొత్త టెక్నాలజీని ప్రవేశ పెడుతున్న కాలంలో ఏర్పడే ఉపాధి అవకాశాలు అది ప్రవేశ పెట్టడం పూర్తైన తర్వాత తగ్గిపోతాయి. అంటే ఎ.ఐ ఒక బుడగగా పరిణమించక పోయినా దానిని ప్రవేశ పెట్టడం పూర్తి అయిన తర్వాత ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. రెండవది ఎ.ఐ స్వభావమే ఉపాధి అకాశాలను తగ్గించడం. అందుచేత అది ప్రవేశించడంతో ఉపాధి అవకాశాలు అంతకు మునుపు ఉన్నవి హరించుకుపోతాయి. మూడవది: మొత్తంగా చూసినప్పుడు ఉద్యోగులకు లభించే వాటా (జీతాల రూపంలో) తగ్గిపోతుంది. దాని వలన ఆర్థిక కార్యకలాపాలు తగ్గుతాయి. ఈ మూడింటి వలనా దీర్ఘకాలంలో నిరుద్యోగం స్థాయి పెరిగిపోతుంది. అది నయా ఉదారవాద వ్యవస్థలో మాంద్యాన్ని మరింత పెంచుతుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత హేతువిరుద్ధమైనదో ఈ ఎ.ఐ ని ప్రవేశ పెట్టడమే విదితం చేస్తోంది. టెక్నాలజీ అనేది మనిషి శ్రమను తగ్గించడానికి దోహదం చేయాలి కాని శ్రమించే అవకాశాలను దూరం చేయడానికి దారి తీయకూడదు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థలో అదే జరుగుతోంది. అదే సోషలిజంలోనైతే, ఇటువంటి కొత్త టెక్నాలజీ ప్రవేశం వలన కార్మికుల నిజవేతనాలు ఏమాత్రమూ తగ్గవు సరికదా వారికి తీరుబాటు సమయం పెరుగుతుంది. దాని ఫలితంగా మానవుల సామర్థ్యం పెరుగుతుంది. అదే కొత్త టెక్నాలజీని పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రవేశ పెట్టినప్పుడు అందుకు పూర్తి భిన్నంగా నిజవేతనాలు పడిపోడానికి, ఉపాధి అవకాశాలు తగ్గిపోడానికి, పర్యవసానంగా మానవుల సామర్థ్యం తగ్గిపోడానికి అది దారి తీస్తుంది.

(స్వేచ్ఛానుసరణ) ★

పరిశోధనలకు ప్రాధాన్యత ఏదీ?

కంచల జయరాజ్


మానవాళి శ్రేయస్సు కోసం చేసిన విశిష్ట సేవలకు అందించే అత్యున్నత గౌరవం నోబెల్. వైద్య విజ్ఞానం, సాహిత్యం, శాంతి, ఆర్థికశాస్త్రం వంటి విభాగాల్లో ప్రతి సంవత్సరం ఈ బహుమతులు అందజేస్తారు. సాంస్కృతిక వారసత్వం, జ్ఞాన సంపద, ఆధ్యాత్మిక లోతులు కలిగిన మన దేశానికి ఈ గౌరవం రావాలని భావిస్తాం. కానీ వాస్తవాన్ని తార్కికంగా పరిశీలిస్తే నిరాశ కలుగుతుంది. స్వాతంత్ర్యం పొంది 75 సంవత్సరాలకు పైగా గడిచినా భారతదేశానికి లభించిన నోబెల్ బహుమతులను వేళ్ల మీద లెక్కించవచ్చు. రాజకీయ, సామాజిక, విద్యా, పరిశోధనా వ్యవస్థలలో ఉన్న లోపాలు దీని వెనుక ఉన్న కారణాలనిపిస్తుంది. "మన ప్రతిభ తక్కువా? లేక మన వ్యవస్థ ప్రపంచ ప్రమాణాలకు అందుకోవడంలో విఫలమైందా?" అనే ప్రశ్నలు తప్పక మనసులో ఉత్పన్నమవుతాయి.

ఇప్పటిదాకా మనకు లభించిన నోబెల్ బహుమతులు

భారత్‌లో పుట్టిన లేదా భారత మూలాలున్న వ్యక్తులు ఇప్పటివరకు సాధించిన నోబెల్ గౌరవాలు ఇలా ఉన్నాయి. 1. రవీంద్రనాథ్ టాగూర్ (1913)-సాహిత్యంలో నోబెల్ అందుకున్నారు. ఆయన రచించిన గీతాంజలి ప్రపంచ సాహితీవేత్తలను మంత్రముగ్ధులను చేసింది. 2. సి.వి. రామన్ (1930) -భౌతిక శాస్త్రంలో కాంతి వ్యాప్తి (రామన్ ఎఫెక్ట్) ఆవిష్కరణకు గౌరవం అందుకున్నారు. 3. మదర్ థెరిసా (1979) - శాంతి విభాగంలో, పేదల సేవకు, మానవత్వానికి ప్రతీకగా గుర్తింపు లభించింది. 4. అమర్త్యసేన్ (1998) - ఆర్థికశాస్త్రంలో, సామాజిక ఎంపిక సిద్ధాంతానికి నోబెల్ గౌరవం అందుకున్నారు. 5. కైలాష్ సత్యార్థి (2014) - బాల కార్మిక వ్యతిరేక ఉద్యమానికి శాంతి బహుమతి లభించింది. 6. హర్ గోవింద్ ఖోరానా (1968) - జీవ రసాయన శాస్త్రంలో, జన్యు క్రమాల పరిశోధనకు (అమెరికాలో పనిచేసి) నోబెల్ అందుకున్నారు. 7. సుబ్రమణ్యన్ చంద్రశేఖర్ (1983) - భౌతిక శాస్త్రంలో, నక్షత్ర పరిణామంపై పరిశోధనకు (అమెరికా పౌరుడిగా) నోబెల్ వరించింది. 8. వెంకటరామన్ రామకృష్ణన్ (2009) - రైబోసోమ్ నిర్మాణంపై పరిశోధనకు (బ్రిటన్ పౌరుడిగా) అందుకున్నారు. 9. అబ్దుల్ రజాక్ గుర్నా (2021) - భారత మూలాలున్న టాంజానియా రచయిత, సాహిత్యంలో గౌరవం అందింది. అంటే మొత్తం తొమ్మిది సందర్భాల్లో భారతీయ మూలాలున్న వ్యక్తులు నోబెల్ బహుమతిని అందుకున్నారు.

కానీ స్వదేశంలో పనిచేస్తూ గెలుచుకున్న వారు కేవలం ఇద్దరు మాత్రమే. టాగూర్, సి.వి. రామన్. ఇతర దేశాలతో పోలిస్తే మనకు తక్కువ ఎందుకు వస్తున్నాయి? పరిశోధనలకు తగిన ప్రోత్సాహం లేకపోవడం. అమెరికా, జపాన్, జర్మనీ వంటి దేశాలు తమ జిడిపి లో 2.5 శాతం నుండి 3 శాతం వరకు పరిశోధనకు ఖర్చు చేస్తాయి. కానీ భారత్‌లో అది కేవలం 0.7 శాతం వరకు మాత్రమే ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఉన్నత స్థాయి పరిశోధనల కోసం అవసరమైన వనరులు, ఆధునిక ప్రయోగశాలలు, ఆర్థిక మద్దతు లేవు. ఈ లోటు కారణంగా ప్రతిభావంతులు స్వదేశంలో సాధించలేక విదేశాలకు వెళ్తున్నారు. విద్యా వ్యవస్థలో సృజనాత్మకతకు తక్కువ ప్రాధాన్యం వుంటోంది. మన విద్యార్థులను ప్రశ్నలు అడగడం కాకుండా సమాధానాలు గుర్తుపెట్టుకోవడానికే ప్రోత్సహిస్తారు. "ఎందుకు?" అనే ప్రశ్న అడగడంతో సైన్సు ప్రారంభం అవుతుంది. కానీ మన పాఠశాలలు "ఎలా గుర్తుపెట్టుకోవాలి?" అనే దానికే దృష్టి పెడుతున్నాయి. ఈ విధానం విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను అణచివేస్తుంది. మేధో వలస (బ్రెయిన్ డ్రెయిన్) భారత యువత ప్రపంచంలోని ప్రధాన విశ్వవిద్యాలయాలలో ప్రతిభ చూపుతున్నారు. కానీ వారిలో ఎక్కువ మంది విదేశాల్లోనే స్థిరపడిపోతున్నారు. భారత ప్రభుత్వ పరిశోధనా సంస్థలు వీరిని ఆకర్షించడంలో విఫలమవుతున్నాయి. దీంతో, భారత మేధస్సు ఫలితాలు ఇతర దేశాలకు కేటాయించబడుతున్నాయి. నోబెల్ కమిటీ నిర్ణయాలు పూర్తిగా రాజకీయ రహితమని చెప్పడం కష్టమే. ప్రపంచ రాజకీయ దృక్పథం, పాశ్చాత్య మీడియా అభిప్రాయాలు కూడా బహుమతుల ఎంపికపై ప్రభావం చూపుతాయి. భారతదేశంలో వ్యక్తిగత కృషికి ప్రాధాన్యం తక్కువ. మన పరిశోధనలలో చాలా భాగం ప్రభుత్వ సంస్థల సమిష్టి కృషిగా ఉంటుంది. నోబెల్ బహుమతులు సాధారణంగా వ్యక్తిగత ప్రతిభకు ఇస్తారు. ఈ కారణంగా, భారత పరిశోధకులు వ్యక్తిగత గుర్తింపు పొందే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

సామాజిక, సాంస్కృతిక కారణాలు, ఉద్యోగ ప్రాధాన్యంతో పరిశోధన వెనుకబడింది. భారత సమాజంలో పరిశోధనను వృత్తిగా చూడడం ఇప్పటికీ అరుదు. తల్లిదండ్రులు ఉద్యోగ భద్రత ఉన్న కోర్సులను మాత్రమే ప్రోత్సహిస్తారు. ఫలితంగా, శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు కావాలనే ఆలోచన చిన్న వయసులోనే నశిస్తుంది. పరిశోధన వాతావరణం లోపం కూడా వుంది. మన దేశంలోని విశ్వవిద్యాలయాలు పాత పరికరాలతో, తగిన నిధులు లేకుండా పనిచేస్తున్నాయి. పరిశోధనలో స్వేచ్ఛా వాతావరణం లేకపోవడం, బ్యూరోక్రాటిక్ అడ్డంకులు పరిశోధకులను నిరుత్సాహపరుస్తున్నాయి. నూతన ఆవిష్కరణకు అవసరమైన స్థిరమైన పునాది కూడా వుండడంలేదు. భాషా అవరోధాలూ వున్నాయి. భారత పరిశోధకులు అనేక సందర్భాల్లో స్థానిక భాషల్లో రచనలు చేస్తారు. కానీ అంతర్జాతీయ గుర్తింపు పొందాలంటే ఆ పరిశోధనలు ఇంగ్లీష్‌లో ప్రచురించాలి. ఈ భాషా గోడ కారణంగా భారత పరిశోధనలు అంతర్జాతీయ వేదికలపై తగిన స్థానం పొందలేకపోతున్నాయి. పరిశోధనలో పెట్టుబడి పెడితేనే ప్రతిభ ఫలిస్తుంది (పట్టిక). విజ్ఞానాన్ని దేశాభిమానంగా మార్చుకున్న దేశాలకే ప్రపంచ గౌరవం ఎక్కువగా లభిస్తోంది.



నోబెల్ కన్నా గొప్పది జ్ఞానం. నోబెల్ బహుమతి ఒక గౌరవం. కానీ దానికంటే గొప్పది జ్ఞాన సృష్టి. టాగూర్ లేదా రామన్ లు నోబెల్ కోసం పనిచేయలేదు. వారు మానవజాతి శ్రేయస్సు కోసం ఆలోచించారు. ఇప్పటి భారత యువతకు కావలసింది అదే దృక్పథం. జ్ఞానం పట్ల ఆసక్తి, పరిశోధన పట్ల నిబద్ధత, సమాజానికి ఉపయోగపడే విజ్ఞానం సృష్టించే తపన పెంచితే, నోబెల్ బహుమతి మన తలుపు తట్టడం అసాధ్యమేమీ కాదు.

ప్రపంచ దేశాలతో పోలిక

దేశం	మొత్తం నోబెల్లు	పరిశోధన ఖర్చు (జిడిపి లో)
అమెరికా	400+	2.8 శాతం
బ్రిటన్	130+	2.4 శాతం
జర్మనీ	110+	3.1 శాతం
ఫ్రాన్స్	70+	2.3 శాతం
జపాన్	30+	3.2 శాతం
భారత్	9	0.7 శాతం

'నోబెల్' అందుకోవాలంటే...

పరిశోధన బడ్జెట్ పెంపు-ప్రభుత్వం రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఖర్చును కనీసం 2 శాతం వరకు పెంచాలి. విశ్వవిద్యాలయ స్వాతంత్ర్యం- శాస్త్రవేత్తలు స్వేచ్ఛగా ప్రయోగాలు చేయగల వాతావరణం కల్పించాలి. యువ పరిశోధకులకు ప్రోత్సాహం- నూతన ఆవిష్కరణలకు గ్రాంట్లు, స్టార్టప్ మద్దతులు ఇవ్వాలి. అంతర్జాతీయ ప్రచురణ- మన పరిశోధనలు 'నేచర్, సైన్స్' వంటి పత్రికల్లో ఎక్కువగా కనిపించాలి. భాషా అవరోధాల తొలగింపు- స్థానిక భాషలతో పాటు ఇంగ్లీష్‌లో కూడా ప్రచురణను ప్రోత్సహించాలి. విదేశీ మేధావుల తిరిగి రాక- విదేశాల్లో ఉన్న భారతీయ శాస్త్రవేత్తలకు దేశంలో సముచిత అవకాశాలు ఇవ్వాలి. విద్యా సంస్కరణలు- పాఠశాల స్థాయి నుంచే సృజనాత్మకతను ప్రోత్సహించే పాఠ్యపుస్తకాలు రూపొందించాలి.

నోబెల్ కన్నా గొప్పది జ్ఞానం. నోబెల్ బహుమతి ఒక గౌరవం. కానీ దానికంటే గొప్పది జ్ఞాన సృష్టి. టాగూర్ లేదా రామన్ లు నోబెల్ కోసం పనిచేయలేదు. వారు మానవజాతి శ్రేయస్సు కోసం ఆలోచించారు. ఇప్పటి భారత యువతకు కావలసింది అదే దృక్పథం. జ్ఞానం పట్ల ఆసక్తి, పరిశోధన పట్ల నిబద్ధత, సమాజానికి ఉపయోగపడే విజ్ఞానం సృష్టించే తపన పెంచితే, నోబెల్ బహుమతి మన తలుపు తట్టడం అసాధ్యమేమీ కాదు. భారత మేధస్సు అద్భుతమని ప్రపంచం గుర్తించింది. ఇప్పుడు మన బాధ్యత. దానిని ఆచరణలో చూపించడం, ప్రపంచానికి మార్గదర్శకం కావడం. అప్పుడు 'భారత్‌కి నోబెల్ ఎందుకు రావడం లేదు?' అనే ప్రశ్న మళ్లీ వేసుకోవాల్సిన అవసరమే ఉండదు.

★

జనవాక్యం

దూసుకుపోతున్న పాడెలు

అదుపులేని ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణీకుల ప్రాణాల్ని గాలిలో దీపాలుగా చేస్తున్నాయి. కర్నూలు దగ్గరలో జరిగిన ప్రమాదంలో బస్సులోనే ఆహుతి అయిన 19 మానవ ప్రాణాలు ఈ దుస్థితికి ఉదాహరణ. ఆ ప్రమాద కారణాలు ప్రత్యక్షంగా ఏవైనప్పటికీ, అలాంటి ప్రమాదం ఏర్పడడానికి పరోక్షంగా దోహదపడిన పరిస్థితుల్ని చక్కదిద్దడానికి పూనుకోకపోతే మళ్లీ మళ్లీ అలాంటి దురదృష్టకర సంఘటనలకు పెచ్చరిల్లుతాయి. ఈ దుర్ఘటన జరిగాక ఆంధ్రప్రదేశ్‌లో సంబంధిత అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. రెండు రోజుల్లో 360కి పైగా అతిక్రమణలను గుర్తించారు. నలభై బస్సుల్ని సీజ్ చేశారు. కళ్లెదుట ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణించే బస్సులు ఒక్క రోజు తనిఖీలోనే పదుల సంఖ్యలో ప్రయాణింప వీలుగాని కండిషన్‌లో ఉన్నాయంటే వ్యవస్థ ఏ స్థితిలో ఉందో అర్థమౌతుంది. మితిమీరి లాభాలు పొందడానికి ప్రైవేట్ ట్రావెల్ సంస్థలు గడ్డి కరిచినా, వాటిని నియంత్రించే వ్యవస్థకి ఏమైంది? ఆల్ ఇండియా పర్మిట్లు ఈశాన్య రాష్ట్రాల్లో తీసుకోవడం, బళ్ళు ఇక్కడ తిప్పడంలోనే అవినీతి జాడలున్నాయి. సిటింగ్‌కి అనుమతి తీసుకుని, స్లీపర్‌గా మార్చి ప్రయాణీకుల రక్షణని రోడ్డున పడేస్తే, అధికారులు గమనించలేక పోతున్నారా? అగ్నిమాపక నిబంధనల్ని ఖచ్చితంగా అమలు చేయాల్సిన చోట చూసీచూడనట్లు వదిలేయడం ఎంత దారుణం? ఈ రెండు రోజుల్లో నమోదైన అతిక్రమణల కేసులు చూస్తే అర్థమయ్యేది ఏమిటంటే నిబంధనలు పాటించే వారి కన్నా అతిక్రమించే వాళ్లే ఎక్కువగా ఉన్నారు. నియంత్రించాల్సిన వ్యవస్థలు అలసత్వంతోనో, అవినీ తోనో కళ్లు మూసుకొంటున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే జరిగే తనిఖీల హడావిడి రెండ్రోజుల తర్వాత పూర్తిగా అటకెక్కుతుంది. తర్వాత షరా మామూలే. పాడె మారు వేషంలో స్పీడుగా తిరుగుతుంది రోడ్ల మీద. ఈ స్థితి మారాలి. రోడ్డు నిబంధనల్ని నిక్కచ్చిగా పాటించేలా చూడాలి. స్పీడు అతిక్రమించితే బైక్ నైనా సీజ్ చెయ్యాలి. భారీగా పెనాల్టీ వెయ్యాలి. ప్రజా రవాణా వాహనాల్ని ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ కండిషన్‌లో నియంత్రణలో ఉంచాలి. రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాల్ని కోల్పోతున్నాం. సరైన చర్యల ద్వారా వాటిని బాగా తగ్గించగలం.ప్రభుత్వం బాధ్యత పడాలి.


- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

పోర్టులతో రైళ్ల అనుసంధానం

- సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నూతనంగా నిర్మించే పోర్టులకు రైల్వేలైన్లను అనుసంధానించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు- గుంతకల్లు, గుణదల-ముస్తాబాద్‌బైపాస్, రేణిగుంట, రాయదుర్గ్- తుముకూరు మధ్య రైల్వే లైన్‌లు,ప్రస్తుతం రాష్ట్రంలో చేపట్టిన రూ.33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులపై ప్రధానంగా ఈ సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ మూలపేట, విశాఖ, కాకినాడ, రామాయపట్నం పోర్టులకు కనెక్టివిటీని పెంచేలా రైల్వే లైన్లు వేయాలని రైల్వే అధికారులకు సిఎం సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి ఉత్పత్తుల రవాణా కోసం రైల్వే సహకారం అవసరమన్నారు. కేంద్రంతో కలిపి రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్- చెన్నై మార్గాల్లో హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్వే కారిడార్‌కు సంబంధించిన ప్రతిపాదనలపై కూడా సిఎం చర్చించారు. అమరావతిలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధించేలా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు రావాలని అన్నారు. తిరుపతినికలుపుతూ చెన్నై -బెంగళూరుహైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్ ఉండేలా చూడాలన్నారు. మరో వైపు ఖరగ్‌పూర్ నుంచి చైన్నై వరకు డెడికేటెడ్ రైలు రవాణాకారిడార్‌పైనా సమీక్షలో సిఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో కొత్తగా 1,564కిలో మీటర్ల కొత్త మార్గాలకు సంబంధించిన పనులను కూడా ఆయన సమీక్షించారు. నడికుడి -శ్రీకాళహస్తి మార్గంలో పనులు చేపట్టేందుకు అవసరమైన రూ.27కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. కోటిపల్లి - నరసాపూర్ మార్గంలో కాకినాడ-కోటిపల్లి- అమలాపురం మార్గంలో రైలుస ర్వీస్ నడపాలన్నారు. గన్నవరంలో నూతనరైల్వే కోచింగ్ టెర్మినళ్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని రైల్వే శాఖ చేసిన ప్రతిపాదనకు అంగీకారం తెలిపారు. వీటితో పాటు గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనులు వేగంగా చేపట్టాలని, కాజిపేట - విజయవాడ మధ్య మూడో లైన్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు.



రాష్ట్రంలో ఐకానిక్‌రైల్వే స్టేషన్లు:

విజయవాడ,విశాఖ, తిరుపతిలను ఐకానిక్ రైల్వే స్టేషన్లుగా అభివృద్ధి చేయాలని సిఎం అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నూతనంగా నిర్మించనున్న అమరావతి రైల్వే స్టేషన్‌ను కూడా వినూత్నంగానిర్మాణం చేపట్టాలన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు వేగంగా చేపట్టాలని , తిరుపతి స్టేషన్ నుంచి ప్రయాణీకులసౌలభ్యం కోసంస్కైవాక్ నిర్మించాలని సిఎం అన్నారు. విశాఖలో జ్ఞానాపురం వైపు అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. ఈ సమీక్షలో రోడ్లు భవనాల శాఖమంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, దక్షిణ మధ్య రైల్వే జిఎంసంజయ్‌శ్రీవాస్తవ, తూర్పు కోస్తా రైల్వే జిఎం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ప్రజాశక్తి-వంగర (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా వంగర మండలం కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన రైతు పారిచర్ల వెంకటరమణ (49) విద్యుదాఘాతంతో మృతిచెందారు. మొంథా తుపాను నేపథ్యంలో తన పొలంలో ఉన్న నీటిని బయటకు తీసేందుకు సోమవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. గాలికి తెగిపడిన విద్యుత్ తీగను వెంకటరమణ గమనించకపోవడంతో అది కాలికి తగిలింది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. సమీప రైతులు గమనించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంకటరమణ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డిగ్రీ మూడో దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ మార్పు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను నేపథ్యంలో డిగ్రీ అడ్మిషన్ల మూడో దశ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో ఎపి ఉన్నత విద్యామండలి మార్పులు చేసింది. కొత్త షెడ్యూల్‌ను డిగ్రీ అడ్మిషన్ల కన్వీనర్, ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్ టివి కృష్ణమూర్తి సోమవారం విడుదల చేశారు. ఈ నెల 29 వరకు అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని, సర్టిఫికెట్ల పరిశీలన నవంబరు 2 వరకు జరుగుతుందని వెల్లడించారు. వెబ్ ఆప్షన్ల ఎంపిక 2వ తేదీ వరకు అవకాశం ఉందని, 3వ తేదీన ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నవంబరు 4న సీట్ల కేటాయింపు ఉంటుందని, విద్యార్థులు 4 నుంచి 7వ తేదీలోపు సీట్లు పొందిన కళాశాలల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.



న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ సమావేశమైన జైశంకర్

న్యూజిలాండ్ ప్రధానితో జైశంకర్ భేటీ

- మలేషియా విదేశాంగ మంత్రితోనూ..

కౌలాలంపూర్ : కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సోమవారం కౌలాలంపూర్‌లో న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో సమావేశమయ్యారు. మలేషియా విదేశాంగ మంత్రి మహ్మద్ హాజీ హసన్‌తోనూ భేటీ అయ్యారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఎఎస్ఇఎఎన్) వార్షిక శిఖరాగ్ర సమావేశాలు కోసం జైశంకర్ అక్కడకు చేరుకున్న సంగతి తెలిసిందే. న్యూజిలాండ్ ప్రధానమంత్రితో జరిగిన సమావేశంలో నరేంద్ర మోడీ తరపున ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 'భారత్-న్యూజిలాండ్‌ల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, స్వేచ్ఛాయుతమైన, బహిరంగ ఇండో-పసిఫిక్‌ను పెంపొందించడానికి క్రిస్టోఫర్ లక్సన్ నిబద్ధతను స్వాగతిస్తున్నాం' అని సమావేశం అనంతరం జైశంకర్ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. హసన్‌తో సమావేశంలో భారత్-మలేసియాల మధ్య ద్వైపాక్షిక సహకారంలో పురోగతి గురించి చర్చించినట్లు తెలిపారు. ఈ మేరకు జైశంకర్ ఎక్స్‌లో మరో పోస్టు చేశారు. ఆదివారం మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో జైశంకర్ సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ నెల 26న ప్రారంభమైన 47వ ఎఎస్ఇఎఎన్ వార్షిక శిఖరాగ్ర సమావేశాలు మంగళవారం వరకూ జరగనున్నాయి.

టీనేజర్ ఆత్మహత్య కేసు

- అరుణాచల్‌లో ఐఎఎస్ అధికారి లొంగుబాటు

గౌహతి : టీనేజర్ ఆత్మహత్య కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న అరుణాచల్ ప్రదేశ్‌లోని ఒక ఐఎఎస్ అధికారి సోమవారం పోలీసుల ముందు లొంగిపోయారు. ఈ తరువాత పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. ఈ కేసు వివరాల ప్రకారం ఈ నెల 23న పాపుమ్ పరే జిల్లాలోని లేఖి గ్రామంలో 19 ఏళ్ల గోమ్చు యేకర్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. అతని గదిలో అనేక లేఖలను గుర్తించారు. ఈ లేఖల్లో ఐఎఎస్ అధికారి తలో పోటోమ్, రాష్ట్ర గ్రామీణ పనుల విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లిక్వాంగ్ లోవాంగ్ తనపై అసహజ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని యేకర్ రాసాడు. నిరంతర అవమానాలు, బలవంతం, బెదిరింపులు కారణంగా ఆత్మహత్య వైపు తనను నడిపించాయని కూడా తెలిపారు. దీంతో యేకర్ తండ్రి ఫిర్యాదు మేరకు నిర్జులి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదయింది. ఎఫ్ఐఆర్‌లో తలో పోటోమ్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. కాగా, యేకర్ ఆత్మహత్య చేసుకున్న కొన్ని గంటల్లోనే లోవాంగ్ కూడా ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోటోమ్ పరారయ్యారు. దీంతో పోటోమ్‌పై లుకౌట్ నోటీసు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పోటోమ్ సోమవారం ఉదయం 7:30 గంటలకు నిర్జులి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు అతన్ని జ్యుడిషయిల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. 14 రోజుల కస్టడీ విధించారు. అలాగే, పోలీసులకు లొంగిపోయే ముందు పోటోమ్ ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. తనపై అభియోగాలను తిరస్కరించారు. మృతుడితో తనకు ఎలాంటి వ్యక్తిగత సంబంధాలు లేవని, తాను ఇటానగర్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సమయంలో మృతుడ్ని మల్టీ టాస్కింగ్ స్టాఫ్ సభ్యుడిగా నియమించినట్లు గుర్తు చేసుకున్నారు. ప్రతీ ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని అందుకే యేకర్ మరణంపై న్యాయమైన దర్యాప్తు జరగడానికే తాను లొంగిపోతున్నట్లు వెల్లడించారు.

'కరూర్' మృతుల కుటుంబాలకు విజయ్ పరామర్శ

చెన్నై : కరూర్ తొక్కిసలాట ఘటనలో మరణించిన వారి కుటుంబ సభ్యులను టివికె అధ్యక్షులు విజయ్ పరామర్శించారు. చెన్నైకు సమీపంలోని మామల్లపురంలోని ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో ఆయన వారిని కలుసుకున్నారు. తొక్కిసలాట జరిగిన నెల రోజుల తరువాత బాధిత కుటుంబాలను విజయ్ పరామర్శించడం విశేషం. ఈ కుటుంబాలను కరూర్ నుంచి ఆదివారం మామల్లాపురం తీసుకొచ్చారు. రిసార్ట్‌లోనే వారికి వసతి కల్పించారు. సోమవారం ఉదయం వారితో విజయ్ మూడు గంటలపాటు సమావేశమయ్యారు. ప్రతి కుటుంబాన్నీ విజయ్ వ్యక్తిగతంగా కలుసుకున్నట్లు, సాధ్యమైనంత సాయం చేస్తామని విజయ్ హామీ ఇచ్చినట్లు కుటుంబాలు మీడియాకు తెలిపాయి. సెప్టెంబరు 27న కరూర్‌లో టివికె ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

3న సిఎస్‌లు హాజరు కావాల్సిందే

వీధికుక్కల అంశంపై సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆగస్టులో జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఘోరంగా విఫలమయ్యాయని, ప్రపంచస్థాయిలో స్థాయిలో దేశం పరువు తీశారంటూ ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల నియంత్రణకు వాటికి శస్త్రచికిత్స చేసి, తిరిగి వదిలే విధానాన్ని అమలు చేయాలని ఆగస్టులో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఢిల్లీ ప్రభుత్వాలు మాత్రమే స్పందించాయి. దీపావళి సెలవుల్లో అఫిడవిట్లు సమర్పించడంతో రికార్డుల్లో అధికారికంగా నమోదు కాలేదు. ఈ పరిణామంపై సోమవారం విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నవంబర్ 3న అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. తెలంగాణ, పశ్చిమ బెంగాల్ సిఎస్‌లకు మినహాయింపు ఇచ్చింది. తమ ఆదేశాల తర్వాత కూడా దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు నమోదయ్యాయని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రజల భద్రతను నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణమైన విషయం కాదంటూ రాష్ట్రాలను ఉద్దేశించి కోర్టు స్పష్టం చేసింది. దీనిపై వచ్చే సోమవారం విచారణ జరుగుతుంది.

భైరవానితిప్ప ప్రాజెక్ట్ నాలుగు గేట్లు ఎత్తివేత

- దిగువకు నీరు విడుదల

ప్రజాశక్తి - గుమ్మగట్ట, రాయదుర్గం

భైరవానితిప్ప ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువ ఉండడంతో మందు జాగ్రత్త చర్యలో భాగంగా వేదావతి హగరికి నాలుగు గేట్లు ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ హరీష్ కుమార్ తెలిపారు. నది పరివాహక ప్రాంతం కర్ణాటక రాష్ట్రంలో వాణి విలాస్ రిజర్వాయర్ నిండి ఎక్కువైన నీరు వేదవతి నదిలో రాగా బిటి ప్రాజెక్టులోకి 3750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 1655 అడుగులు కాగా ప్రస్తుతం 1653.2 అడుగుల మేరకు నీటి మట్టం ఉంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం రెండు టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.724 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 5,6,7,8 గేట్లను ఒక అడుగు మేరకు ఎత్తి 3500 క్యూసెక్కుల నీటిని వేదవతి నదిలోకి అధికారులు విడుదల చేశారు. పర్యవసానంగా గుమ్మగట్ట వైపు నుండి వేపలపర్తి నడుమ వేదవతి నదిపై నీటి ప్రవాహం వల్ల రాకపోకలు నిలిచిపోయాయి. భూపసముద్రం వద్ద కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేసిన తొలి రోజునే ఒక యువకుడు స్పిల్ వే వద్ద నీటిలో పడి మృతి చెందడంతో ప్రాజెక్టు వద్ద నీటిలో ఎవరు దిగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేపలపర్తి గుమ్మగట్ట నడుమ వేదవతి కాజ్ వే పై రాకపోకలు సాగించకుండా అడ్డుకట్ట వేశారు. నదిలో నీటి విడుదల అధికం కావడంతో కనేకల్లు మాల్యం నడుమ వేదవతి నదిలో రాకపోకలు నిలిచిపోయాయి.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం


ఆరబోసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న వి.రాంభూపాల్, రామకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

మొక్కజొన్న పంటలను సాగు చేసిన రైతుల కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కొత్తచెరువులోని ధర్మవరం రోడ్డు రైస్ మిల్ వద్ద ప్లాట్‌ఫాంపై లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన రైతులు శ్రీనివాసులు, పుల్లప్ప నిలువ ఉంచిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ... ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా రైతులు మొక్కజొన్న పంటను అధికంగా సాగు చేస్తున్నారని చెప్పారు. ఈ పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. దళారులు, వ్యాపారులు రైతుల నుండి క్వింటా ధర 18 వందలకు కొనుగోలు చేస్తున్నారని ఆ ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదన్నారు. ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందున దళారులు, వ్యాపారులు రైతుల నుండి తీసుకున్న స్టాకును అలాగే ఉంచుకొని ఈ కొనుగోలు కేంద్రాల్లో అధిక డబ్బులకు అమ్ముకుంటున్నారన్నారు. ఈ దళారీ వ్యవస్థను ప్రభుత్వం నియంత్రించాలని రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పండిస్తే వాటికి ధర లేకపోవటంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ప్రభుత్వం రైతులకు ఎరువులను, ప్రత్యామ్నాయ విత్తనాలను అందించడంలో విఫలమైందన్నారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్న ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఎంఎస్ఎంఇల బలోపేతానికి చర్యలు

- ప్రత్యేకంగా వ్యూహ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

చిరు పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా మధ్య, చిన్న, సూక్ష్మ పారిశ్రామిక సంస్థలను ఏర్పాటుచేసుకునే వారిని ప్రోత్సహించేందుకు, కొత్త ఎంఎస్ఎంఇలను ఏర్పాటు చేయించేందుకు గానూ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. వ్యూహాత్మక పెట్టుబడుల ప్రణాళిక-అమలు ప్రణాళిక (ఎస్ఐపి-ఐపి) పేరిట ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు పరిశ్రమలశాఖ ప్రకటించింది. ఈ మేరకు కొన్ని మార్గదర్శకాలను కూడా వెలువరించింది.

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యాన రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఇ (రాంప్) పేరిట ఒక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇది ప్రపంచ బ్యాంకు నిధులతో కొనసాగుతోంది. ఈ పథకానికి కొనసాగింపుగానే రాష్ట్రంలో ఎస్ఐపి-ఐపి అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ విధానాన్ని అమలు చేసేందుకు 10 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి పరిశ్రమలశాఖ కార్యదర్శి ఛైర్మన్‌గా, ముఖ్య సమన్వయాధికారిగా వ్యవహరిస్తారు. అలాగే సభ్య కన్వీనర్‌గా ఎంఎస్ఎంఇ అభివృద్ధి సంస్థ సిఇఒ, సభ్యులుగా పేదరిక నిర్మూలన సంస్థ సిఇఒ, మెప్మా ఎమ్‌డి, విశాఖలోని ఎంఎస్ఎస్ఇల నుంచి ఒక ప్రతినిధి, ఎంఎస్ఎస్ఇ జాయింట్ డైరెక్టర్, ఎన్‌పిఎంయు స్టేట్ మేనేజర్, ఎస్‌పిఐయు నుంచి ఒక ప్రతినిధితోపాటు ప్రత్యేక ఆహ్వానితునిగా జిల్లా నోడల్ అధికారి ఉంటారు. వీరికి అదనంగా అవసరమైతే కొంతమంది అధికారులు, నిపుణులను కమిటీలో నియమించుకునేందుకు అనుమతినిచ్చారు.

ఎస్ఐపి-ఐపి కార్యక్రమాలను రాంప్ నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్దేశించారు. ఎంఎస్ఎంఇల మధ్య పోటీతత్వం పెంచేలా చూడటం ద్వారా వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అలాగే ఎస్ఐపి-ఐపి నిర్వహణ కమిటీ కూడా ప్రతినెలా ఒకసారి భేటీ అయి ఎంఎస్ఎంఇల పనితీరుపై సమీక్ష నిర్వహించాలని, వ్యూహాత్మక ఎంఎస్ఎంఇల పెట్టుబడులు, వాటి అమలుపై చర్చించాలని నిర్దేశించారు. స్టేక్ హోల్డర్ల మధ్య సమన్వయం నెలకొల్పేలా చూడాల్సిన బాధ్యత ఎస్ఐపి-ఐపి కమిటీదేనని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికలను కూడా ప్రతినెలా చివరి మంగళవారం కేంద్ర ఎంఎస్ఎంఇ మంత్రిత్వశాఖకు పంపించాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇసిఎంఎస్ కింద ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఇసిఎంఎస్) కింద ఒక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సోమవారం నాడిక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంతోపాటు తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఏడు ప్రాజెక్టుల్లో మొదటి ట్రెంచ్‌కు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. రూ.5,532 కోట్ల విలువైన ప్రాజెక్టులని తెలిపారు. ఈ ప్రాజెక్టులు రూ.36,559 కోట్ల విలువైన భాగాల ఉత్పత్తికి, 5,100 కంటే ఎక్కువ ప్రత్యక్ష ఉద్యోగాల సృష్టికి దారితీస్తాయని అన్నారు. ఆమోదించిన యూనిట్లు తమిళనాడు (5), ఆంధ్రప్రదేశ్ (1), మధ్యప్రదేశ్ (1) ఉన్నాయన్నారు. రాష్ట్రంలో సిర్మా స్ట్రాటజిక్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మల్టీ-లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు (పిసిబిలు) తయారు చేస్తుందన్నారు. రూ.765 కోట్ల పెట్టుబడి పెట్టనుందని, రూ.6,933 కోట్లు ఉత్పత్తి చేయనుందని తెలిపారు. 955 ఉద్యోగాలు ఇస్తారని తెలిపారు. దేశవ్యాప్తంగా మల్టీ-లేయర్ ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు (పిసిబిలు), హెచ్‌డిఐ పిసిబిలు, కెమెరా మాడ్యూల్స్, కాపర్ క్లాడ్ లామినేట్‌లు, పాలీప్రొఫైలిన్ ఫిల్మ్‌లు దేశంలో తయారవుతాయని తెలిపారు. వీటి కోసం 249 దరఖాస్తులు అందాయని అన్నారు. రూ.1.15 లక్షల కోట్ల పెట్టుబడి, రూ.34 లక్షల కోట్ల ఉత్పత్తి, 1.42 లక్షల ఉద్యోగాలను సృష్టించనున్నాయని తెలిపారు.

జాతీయ సహకార ప్రముఖుడు మామిడి కన్నుమూత


మామిడి రామారెడ్డి

విజయవాడ : ప్రముఖ జాతీయ సహకారవేత్త మామిడి రామారెడ్డి (83) అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులో కన్నుమూశారు. జాతీయ సహకారోద్యమ నిర్మాణంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. అనేక జాతీయ సహకార కమిటీల్లో సభ్యులుగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యనాథన్ కమిటీలో కూడా ఆయన సభ్యుడు. సహకార సంస్థలు రాజకీయాలకు అతీతంగా ప్రజాతంత్రంగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ అందుకు అనుగుణంగా జాతీయ, రాష్ట్రీయ సహకార చట్టాల్లో మార్పుల కోసం ఆయన విశేషంగా కృషి చేశారు. ఆర్థిక సరళీకరణ విధానాల నేపథ్యంలో ప్రభుత్వాలు సహకార సంస్థలకు స్వయంప్రతిపత్తి కల్పించాలని నాటి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ పి.జె.కురియన్, జె.సి.జైన్‌లతో కలిసి రామారెడ్డి కృషి చేశారు. దేశంలోనే మొట్టమొదటిగా రెండో సహకార చట్టం 'మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ - 1995' ముఖ్యమంత్రిగా ఎన్‌టి రామారావు హయాంలో రూపొందడం వెనుక ఆయన ప్రముఖ పాత్ర పోషించారు.

దక్షిణాఫ్రికా టెస్ట్ పగ్గాలు బవుమాకే..

- భారత్‌తో సిరీస్‌కు జట్టు ప్రకటన



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా టెస్టు సారథి తెంబా బవుమా మళ్లీ జట్టు పగ్గాలు అందుకున్నాడు. భారత పర్యటన రానున్న దక్షిణాఫ్రికా టెస్ట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. నవంబర్‌లో దక్షిణాఫ్రికా జట్టు భారత పర్యటనకు రానుంది. టీమిండియాతో రెండు టెస్టుల సిరీస్ ఆడే సఫారీ జట్టును సోమవారం సెలెక్టర్లు ప్రకటించారు. బవుమా కెప్టెన్‌గా 15మందితో కూడిన పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు. ఇటీవల పాకిస్థాన్ పర్యటనలో అదరగొట్టిన వారికి అవకాశమివ్వాలని సెలెక్టర్లు భావించడంతో.. మిస్టరీ స్పిన్నర్ హార్మర్ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. 'పాకిస్థాన్‌తో సిరీస్ డ్రా చేసుకోవడంలో కుర్రాళ్లు కీలక పాత్ర పోషించారు. అందుకే వాళ్లకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించాం. భారత్‌లోనూ పాక్ తరహా పిచ్‌లు, వాతావరణ పరిస్థితులే ఉంటాయి కాబట్టి వారిని కొనసాగించడం సరైందనిపించింది' అని హెడ్‌కోచ్ షుక్రి కొన్రాడ్ వెల్లడించాడు. నవంబర్ 14 ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్ట్, 22న గౌహతిలో రెండో టెస్టు జరుగుతుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో సంచలన విజయాలతో డబ్ల్యుటిసి టైటిల్‌ను చేజిక్కించుకున్న దక్షిణాఫ్రికా జట్టు.. తొలిసారి ఒక ఐసిసి టైటిల్‌ను కొట్టిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత తొలి పర్యటనలోనే ఆ జట్టుకు పాకిస్థాన్ షాకిచ్చింది. రెండు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓటమితో దక్షిణాఫ్రికా జైత్రయాత్రకు చెక్ పెట్టింది పాక్.. అయితే.. నిర్ణయాత్మక రెండో మ్యాచ్‌లో గొప్పగా ఆడిన సఫారీ కుర్రాళ్లు.. ఆతిథ్య జట్టుకు షాకిచ్చారు. దాంతో 1-1తో సిరీస్ పంచుకుంది సఫారీ టీమ్. ఇప్పుడు భారత పర్యటనలోనూ గొప్పగా ఆడాలని బవుమా నేతృత్వంలోని దక్షిణాఫ్రికాపట్టుదలతో ఉంది.

జట్టు : తెంబా బవుమా(కెప్టెన్), బాష్, బ్రెవీస్,రికెల్టన్, స్టబ్స్, వెర్రెనే, డీజోర్జి, హంజా, హార్మర్, యాన్సెస్, మహరాజ్, మర్క్‌రమ్, ముల్డర్, ముత్తుస్వామి, రబడా.

ఎన్నికల కమిషన్ ప్రకటన ఏకపక్షం

కేరళ సహా 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలుపై సిపిఎం విమర్శ

న్యూఢిల్లీ : భారత ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను (ఎస్ఐఆర్)ను 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలు చేస్తామని ప్రకటించడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ బేబి ఖండించారు. ఇసి ప్రకటన ఏకపక్షంగా ఉందని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో సోమవారం ఆయన పోస్ట్ చేశారు. బీహార్‌లో అమలు చేసిన ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలైనాయని, వాటిని దేశ అత్యున్నత న్యాయస్థానం విచారిస్తున్న తరుణంలో ఎన్నికల కమిషన్ అకస్మాత్తుగా, ఏకపక్షంగా ఎస్ఐఆర్ ప్రకటించడం ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధమని విమర్శించారు. ఇది కోర్టులను ధిక్కరించడమేనన్నారు.

స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేరళ అసెంబ్లీ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా తీర్మానించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్య సంస్థలు చేసిన సూచనలను ఇసి పట్టించుకోలేదన్నారు. ఇసి చర్యలు పాలక పార్టీకి అనుకూలంగా ఉన్నాయనే అనుమానాలను కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

తొందరపాటు చర్య!

ఎన్నికల కమిషన్‌ను పక్కకు నెట్టడం ద్వారా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కాలరాయడానికి కేంద్రప్రభుత్వం పాల్పడుతున్న చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు కేరళ రాష్ట్ర కార్యదర్శివర్గం ఒక ప్రకటన విడుదల చేసింది. బీహార్‌లో ప్రస్తుతం అమలుచేసిన ఎస్ఐఆర్ నమూ నాను కేరళ సహా దేశవ్యాప్తంగా విస్తరించడానికి ఎన్నికల కమిషన్ తొందరపాటు చర్యలు తీసుకోవడం ఆరంభించిందని ఆ ప్రకటన విమర్శించింది. కేరళలో ఎస్ఐఆర్ అమలుకు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నారని తెలిపింది. ఇందులో భాగంగా ప్రస్తుతం ఓటర్ల జాబితాను స్తంభింపచేశా రన్నారు. నవంబరు 4 నుండి డిసెంబరు 4 వరకు డేటాను సేకరించాలని, డిసెంబరు 9న ముసాయి దా ఓటర్ల జాబితాను ప్రచురించాలన్నది ప్రణాళిక అని కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో పేర్కొంది. కేరళలో స్థానిక ఎన్నికల తర్వాత ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా చేసిన అభ్యర్థనను ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. పూర్తి ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యను కమిషన్ చేపట్టిందని ఆ ప్రకటన విమర్శించింది. కేరళలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితా గురించి ప్రశ్నించగా, నోటిఫికేషన్ ఇంకా జారీ చేయలేదనే సమాధానం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పార్టీ పేర్కొంది.

శాస్త్రీయంగా రూపొందించిన జాబితా పట్టించుకోరేం?

'కేరళలో శాస్త్రీయంగా రూపొందించిన జాబితాను పట్టించుకోరాదన్నది కమిషన్ నిర్ణయంగా వుంది. ఎస్ఐఆర్‌ను రెండో దశ అమలు చేసే ప్రక్రియలో కేరళను చేర్చారు. ప్రస్తుతమున్న ఓటర్ల జాబితాను సోమవారం అర్ధరాత్రి నుండే స్తంభింపచేశారు. 2002-2004 మధ్య కాలంలో రూపొందిన ఓటర్ల జాబితాల ప్రాతిపదికన సమగ్ర సవరణ వుంటుంది. ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌పై తుది తీర్పు ఇంకా రాలేదు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950, ఓటర్ల నమోదు నిబంధనలు-1960 ప్రకారం ప్రస్తుత ఓటర్ల జాబితా ఈ సమగ్ర సవరణకు ప్రాథమిక పత్రంగా వుండాలి.

అయితే, పాత జాబితా ప్రాతిపదికన సవరణ జరిగితే 50లక్షలకు పైగా ఓటర్లు కేరళ ఓటర్ల జాబితా నుండి మినహాయించబడతారు. మరణించినవా రు, డూప్లికేట్ పేర్లు వున్నవారిని తొలగించడంతో పాటూ వలసలు వెళ్లినవారు, విదేశీయుల పేర్లను తొలగించడం కూడా ఖాయం. పౌరసత్వ జాబితాను అమలు చేసే ప్రయత్నం తప్ప ఇది మరొకటి కాదని కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో విమర్శించింది.

ఇసి విశ్వసనీయతపైనే అనుమానాలు : కాంగ్రెస్

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ చేపడుతున్నట్లు సోమవారం ఎన్నికల కమిషన్ ప్రకటించిన వెంటనే కాంగ్రెస్ ఈ ప్రక్రియను ప్రశ్నించింది. ఈ చర్య పట్ల ఓటర్లు, ప్రతిపక్షాలు సంతృప్తికరంగా లేనందున ఎన్నికల కమిషన్ ఉద్దేశాలు, నిర్ణయాలు, దాని విశ్వసనీయత అనుమానంలో పడుతున్నాయని కాంగ్రెస్ విమర్శించిం ది. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగ అధిపతి పవన్ ఖెరా ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌కు సంబంధించి అడిగిన ప్రశ్నలకే ఇంతవరకు తమకు సమాధానం రాలేదని అన్నారు.



అగ్ర స్థానమే లక్ష్యం.....

- 2035 నాటికి అభివృద్ధిచెందిన దేశంగా చైనా
- చైనా లక్షణాలతో కూడిన సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం దిశగా ముందడుగు
- ప్లీనరీ సమావేశంలో 15వ పంచవర్ష ప్రణాళిక ఆమోదం

బీజింగ్ : చైనా కమ్యూనిస్టు పార్టీ 20వ కేంద్ర కమిటి నాల్గవ ప్లీనరీ సమావేశాలు ఈ నెల 23న ముగిసాయి. దీనిలో 14వ పంచవర్ష ప్రణాళికను సమీక్షించి 15వ పంచవర్ష ప్రణాళిక (2026-2030)ను ఆమోదించింది. ఈ ప్లీనరీ సమావేశాలకు 168 మంది కేంద్ర కమిటి సభ్యులు, 147 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులు హాజరయ్యారు. వీరితో పాటు కేంద్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు, ప్రముఖ విభాగాల అధిపతులు ఆహ్వానితులుగా హాజరయ్యారు. పొలిట్‌బ్యూరో అధ్యక్షత వహించగా పార్టీ ప్రధాన కార్యదర్శి జిన్‌పింగ్ దిశా నిర్దేశం చేశారు. పొలిట్‌బ్యూరో పనితీరును దీనిలో పూర్తిగా సమీక్షించారు. చైనా లక్షణాలతో కూడిన సోషలిజం నిర్మాణానికి పార్టీని మరింత బలోపేతం చేయాలని, సమిష్టి నాయకత్వంతో ఆధునిక జన చైనాను అభివృద్ధి చేయాలని సిపిసి విడుదల చేసిన ప్రణాళికా పత్రంలో పునరుద్ఘాటించింది. పార్టీ పనితీరును ఈ ప్లీనరీ సమావేశాలు సమీక్షించిన అనంతరం పంచవర్ష ప్రణాళికకు సంబంధించిన సిఫార్సులను ఆమోదించాయి. ఈ సమావేశాల్లో అధ్యక్షుడు జిన్‌పింగ్ కీలకోపన్యాసం చేశారు. ముసాయిదా సిఫార్సులపై వివరణ ఇచ్చారు. జిన్‌పింగ్ నాయకత్వాన్ని, పార్టీ కేంద్ర కమిటీ ఐక్యతను ప్లీనరీ ప్రశంసించింది.

15వ పంచవర్ష ప్రణాళిక ముఖ్య లక్ష్యాలు..

ఈ ప్లీనరీ సమావేశాల అనంతరం విడుదల చేసిన ప్రణాళిక ముఖ్య లక్ష్యాలను పరిశీలిస్తే... అత్యున్నత నాణ్యత గల అభివృద్ధిని సాధించడం, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో స్వావలంబన సాధించడం, వేగవంతమైన సంస్కరణలు, ఆధునీకరణ ప్రక్రియను అమలు చేయడం, సాంస్కృతిక, నైతిక పురోగతి, మెరుగైన ప్రమాణాలు, ఉమ్మడి సంక్షేమం, పర్యావరణ ప్రగతి, పటిష్టమైన జాతీయ భద్రతను సాధించడం ప్రధాన లక్ష్యాలుగా చైనా నిర్ణయించుకుంది. ఆధునిక సోషలిస్టు వ్యవస్థను సాధించడానికి ఈ పంచవర్ష ప్రణాళికా కాలం (2026-2030) చాలా కీలకమైనది. సవాళ్లు ఎదురైనా అవకాశాలను అందిపుచ్చుకోవాల్సి వుంటుందని పేర్కొంది. 2035కల్లా తలసరి జిడిపిలో అగ్ర స్థానంలో వుండాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు ఆర్థిక, వ్యవస్థాగత ప్రాధాన్యతలకు సంబంధించిన తయారీ రంగాన్ని దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా తయారుచేయాలని చైనా నాయకత్వం ధృఢంగా కోరుకుంటోంది. సమగ్ర, హరితాభివృద్ధిని పెంపొందించాలని చూస్తోంది. వినూత్న ఆవిష్కరణలతో కూడిన ఎఐ టెక్నాలజీ అభివృద్ధి, నూతన నాణ్యత కలిగిన ఉత్పాదక శక్తులపై దృష్టి పెట్టాలని ఆ రకంగా సాంకేతిక రంగంలో స్వావలంబన సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దేశీయంగా డిమాండ్ విస్తరించాలని, పెట్టుబడుల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని, సమైక్య జాతీయ మార్కెట్‌ను బలోపేతం చేసే వైపు అడుగులు వేస్తోంది. అత్యున్నత ప్రమాణాలతో కూడిన సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సంస్థలను బలోపేతం చేయాలని చైనా భావిస్తోంది. బెల్ట్ అండ్ రోడ్ సహకారాన్ని పెంపొందించాలని, బహుళవాదాన్ని పరిరక్షించడానికి కృషి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సవాళ్లను ఎదుర్కోడానికి సిద్ధం....

అదే సమయంలో చైనా పలు సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం, పాలనాపరమైన చిక్కుముడులు, అవినీతి వంటి సమస్యలతో సతమతమవుతోంది. ఈ సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొనడానికి చేపట్టాల్సిన చర్యలను, కచ్చితమైన, కఠినమైన పార్టీ క్రమశిక్షణను కొనసాగించాల్సి వుందని విధాన పత్రంలో పేర్కొంది. అమెరికా వాణిజ్య యుద్ధం, సాంకేతిక నియంత్రణలు, అంతర్జాతీయంగా సప్లై చెయిన్స్ (సరఫరా గొలుసులు) ఒత్తిళ్లు వంటివి వున్నాయి.

అంతర్గత సమస్యల పరిష్కారంతోపాటు సవాళ్లను అధిగమించడానికి పటిష్టమైన కేంద్ర నాయకత్వం సన్నద్ధం కావాలని, ప్రణాళికలోని విధానాలను ఆచరి స్తూ, భద్రత, స్వావలంబన, సుస్థిరతలపై దృష్టి పెట్టాలని నాల్గవ ప్లీనరీ సమావేశాలు స్పష్టం చేశాయి. రాజకీయ క్రమశిక్షణతో, జాతీయ భద్రతా పరమైన చర్యలతో ఆర్థిక పురోగతిని సమతూకం చేసుకుంటూ ముందుకు సాగడం చైనా కమ్యూనిస్టు పార్టీ కీలకమైన కర్తవ్యమని ఈ సమావేశాలు దిశానిర్దేశం చేశాయి. ఆధునిక చైనా లక్షణాలతో కూడిన సోషలిస్టు వ్యవస్థ నిర్మాణానికి మార్క్సిజం - లెనినిజం, మావో ఆలోచనలు, డెంగ్ జియావో పింగ్ సిద్ధాంతాల ప్రాతిపదికగా సిపిసి పని చేయాలని సమావేశాలు పిలుపునిచ్చాయి.

అసోంకు ప్రత్యేక ఎస్ఐఆర్

- త్వరలో తేదీలు ప్రకటిస్తాం : ఇసి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అసోంలో ప్రత్యేక ఎస్ఐఆర్ నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ప్రకటించారు. సోమవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అస్సాంకు ప్రత్యేక సవరణ ఉత్తర్వులు జారీ చేస్తామని, ప్రత్యేక ఎస్ఐఆర్ తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. పౌరసత్వ చట్టంలోని ప్రత్యేక నిబంధన అస్సాంకు వర్తిస్తుందని అన్నారు. పౌరసత్వ చట్టం ప్రకారం అసోంలో పౌరసత్వం కోసం ప్రత్యేక నిబంధనలు ఉన్నాయని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పౌరసత్వాన్ని తనిఖీ చేసే ప్రక్రియ పూర్తి కానుందని తెలిపారు. జూన్ 24 నాటి ఎస్ఐఆర్ ఆదేశం మొత్తం దేశానికి సంబంధించినదని, అటువంటి పరిస్థితుల్లో ఇది అసోంకు వర్తించదని తెలిపారు. అస్సాంకు ప్రత్యేక సవరణ ఉత్తర్వులు జారీ చేస్తామని, ప్రత్యేక ఎస్ఐఆర్ తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో తమకు ఎలాంటి ఘర్షణ లేదని చెప్పారు. ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న రాజ్యాంగ విధిని ఇసి నిర్వహిస్తోందని తెలిపారు. ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సంఘానికి అవసరమైన సిబ్బందిని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని అన్నారు. 1951 నుంచి 2004 వరకూ ఎనిమిదిసార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002-2004 మధ్య చేపట్టామని తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల బీహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్లు చెప్పారు.

ఐదేళ్లుగా విచారణ లేకుండా జైలులో..

- ఉమర్ ఖలీద్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ పోలీసులకు సుప్రీం మందలింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్లకు సంబంధించి యుఎపిఎ కేసులో నిందితులు దాదాపు ఐదేళ్లుగా విచారణ లేకుండా జైలులో ఉన్నారనే విషయాన్ని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇక ఆలస్యం చేయొద్దని, బెయిల్ పరిశీలన గురించి ఏదైనా చేయగలిగారో, లేదో చెప్పాలని ఢిల్లీ పోలీసులను సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. సామాజిక కార్యకర్తలు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్ మరో ఇద్దరు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై స్పందన దాఖలు చేయడంలో విఫలమైనందుకు ఢిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు మందలించింది. ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరణ తీర్పును సవాల్ చేస్తూ ఆరుగురు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వి అంజరియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్లకు సమాధానం ఇవ్వడానికి ఢిల్లీ పోలీసులకు తగినంత సమయం ఇచ్చినా, సమాధానం దాఖలు చేయలేదని పేర్కొంది. ఢిల్లీ పోలీసుల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు సమాధానం దాఖలు చేయడానికి రెండు వారాల సమయాన్ని కోరారు.

దీనిపై స్పందించిన ధర్మాసనం 'మేము స్పష్టం చేశాము. మీరు (ఎఎస్‌జి) మొదటిసారి హాజరుకావచ్చు. మేము తగినంత సమయం ఇచ్చా ము' అని పేర్కొంది. కనుక మంగళవారం లేదా బుధవారం వాదించాలని ఎఎస్‌జికి ధర్మాసనం సూచించింది. ఈ పిటిషన్లపై సమాధానాలు దాఖలు చేసేందుకు తగినంత సమయం కావాలని పట్టుబట్టారు. దీనిపై స్పందించిన ధర్మాసనం 'వద్దు, వద్దు కౌంటర్‌తో గురువారం వాదించాలని, పిటిషనర్ల తరపున న్యాయవాది కపిల్ సిబల్ దీపావళికి ముందే విచారణకు కోరారని, కానీ తామే వద్దన్నామని' తెలిపారు. చివరికి ఈ పిటిషన్ల విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది.

న్యాయవాదిపై కోర్టు ధిక్కార చర్యలకు సిజెఐ నిరాకరణ

న్యూఢిల్లీ : తనపై దాడి చేసిన న్యాయవాదిపై కోర్టు ధిక్కార కేసు నమోదు చేసేందుకు, అతనికి వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు సిజెఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నిరాకరించారని సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. కోర్టులో నినాదాలు చేయడం, వస్తువులను విసిరేయడం కోర్టు ధిక్కరణ చర్యల కిందకు వస్తాయని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. చట్టప్రకారం కేసు కొనసాగించాలా వద్దా అనేది సంబంధిత న్యాయమూర్తిపై ఆధారపడి ఉంటుందని వెల్లడించింది. ధిక్కార నోటీసు జారీ చేయడంతో న్యాయవాదికి అనవసరమైన ప్రాముఖ్యత లభిస్తుందని, ఘటన కాలపరిమితి పెరుగుతుందని పేర్కొంది. సిజెఐపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిషోర్‌పై ధిక్కార చర్య తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సిబిఎ) దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం సోమవారం విచారించింది. ఇటువంటి ఘటనలను నివారించేందుకు మార్గదర్శకాలు రూపొందించడాన్ని పరిశీలిస్తామని తెలిపింది. వివిధ కోర్టుల్లో జరిగిన ఇటువంటి సంఘటలన వివరాలను క్రోడీకరించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. అక్టోబర్ 6న విచారణ జరుగుతుండగా కోర్టు గదిలో సిజెఐపై న్యాయవాది షూ విసిరిన సంగతి తెలిసిందే. ఈ చర్యను వ్యతిరేకిస్తూ బార్ కౌన్సిల్ అతని లైసెన్స్‌ను రద్దు చేసింది.

బీహార్‌ను మోసం చేయడానికే మోడీ రాక

తేజస్వి యాదవ్



పాట్నా : బీహార్‌ను మోసం చేయడానికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి వస్తున్నారని ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్ విమర్శించారు. మోడీ ప్రదర్శనలు, ర్యాలీలతో క్షేత్రస్థాయిలో వాస్తవాలు మారవని అన్నారు. పాట్నాలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ 'చూడండి.. అందరూ ఎన్నికలకు రావాలి.. కానీ ప్రధాని మోడీ ఇక్కడికి రావడం వల్ల ఏమి తేడా వస్తుంది?.. బీహార్‌ను మోసం చేయడానికే ఆయన ఇక్కడకు వస్తున్నారని అందరికీ తెలుసు' అని అన్నారు. ప్రధానమంత్రి అభివృద్ధి రికార్డును తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. కేంద్ర కేటాయింపుల్లో బీహార్‌కు పారదర్శకత ఉండాలని చెప్పారు.

రేపట్నుంచి రాహుల్‌గాంధీ ప్రచారం

ఈ నెల 29 నుంచి బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పాల్గొననున్నారు. బుధవారం ముజఫర్‌పూర్, దర్భంగా జిల్లాల్లో జరిగే ర్యాలీల్లో రాహుల్ ప్రసంగిస్తారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ముందుగా ముజఫర్‌పూర్‌లోని సక్ర అనే రిజర్వ్‌డ్ స్థానంలో రాహుల్ ప్రచారం ఉంటుందని బీహార్ కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ రాజేష్ రాథోడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రచార సభల్లో తేజస్వియాదవ్‌తో పాటు ఇతర ఇండియా బ్లాక్ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఖర్గే, రాహుల్‌సహా కాంగ్రెస్‌కు 40 మంది స్టార్ క్యాంపెయినర్లు

బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ తరుపున ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కన్హయ్య కుమార్, స్వతంత్ర ఎంపి పప్పుయాదవ్‌తో సహా 40 మంది స్టార్ క్యాంపెయినర్లు పాల్గొననున్నారు.

ఎన్‌డిఎ, జన సురాజ్‌ల మధ్యే పోటీ : ప్రశాంత్ కిషోర్

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి, జన సురాజ్ పార్టీల మధ్యే పోటీ అని ఆ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదు రోజులుగా ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్ బీహార్ ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నారని అన్నారు. ఇండియా వేదిక మూడో స్థానంఓల ఉంటుందని జోస్యం చెప్పారు.

జైళ్ల కన్నా ఘోరంగా...

(మొదటిపేజి తరువాయి)

డిప్లొమా చేస్తున్నారు. ఇక్కడ గదులు కూడా దుర్వాసనతోనూ, శిథిలా వస్థలోనూ ఉన్నాయి. ఇక్కడి పరిసరాలు చుట్టూ చెట్టు, పుట్టా పెరిగి దోమల నిలయంగా ఉన్నాయి. ఎప్పుడు పెంకులు ఊడిపడతాయో తెలియని పరిస్థితి ఉంది.

భయం భయంగా బతుకుతున్నాం : లోకేష్, డిప్లొమా విద్యార్థి



మాది ఒంగోలు. సత్యవేడు పాలిటెక్నిక్ కాలేజీలో సీటు వచ్చింది. వేరే జిల్లా కావడంతో ఈ హాస్టల్లోనే ఉండాల్సి వస్తోంది. ఫస్టియర్ ఇరవై మంది, సెకెండియర్ ఆరుగురు, ఫైనలియర్ 14 మంది విద్యార్థులం ఇక్కడ ఉంటున్నాం. వీరుగాక అప్రెంటిస్ చేసే సీనియర్లు వస్తుంటారు. అందరం కలిసి ఇక్కడే ఉండాలి. చిన్న గదిలో 12 మంది పడుకోవాలి. మొన్న రాత్రి నిద్రపోతుండగా పెంకు ఊడి కింద పడింది. అక్కడ ఎవరైనా విద్యార్థి పడుకుని ఉంటే తలకాయ పగిలి ఉండేది. భోజనం రుచికరంగా ఉండడం లేదు. బతకడం కోసం తింటూ, భయంభయంగా చదువుకుంటున్నాం.

దాతల సహకారం తీసుకోవాలని ప్రభుత్వం చెప్పింది : రామయ్య, బిసి బాలుర హాస్టల్ వార్డెన్

ప్రభుత్వం స్థలం కేటాయించింది. 15 ఏళ్లుగా భవనం నిర్మించాలని ప్రయత్నిస్తూనే ఉన్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో విద్యార్థులు పాత భవనంలోనే ఉన్నారు. దాతల సాయంతో కట్టుకోవాలని ప్రభుత్వం చెబుతోంది తప్ప నిధులివ్వడం లేదు. దీంతో, శ్రీసిటీని అర్థించాం. వారు సానుకూలంగా స్పందించారు. త్వరలో సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

సొంత స్థలంలో నిర్మించాలని కోర్టుకెళ్లాం : చెంచు కృష్ణయ్య, కుమ్మరివీధి



నాలుగు దశాబ్దాలుగా బిసి హాస్టల్ ఉంది. మా పిల్లలంతా ఇక్కడే చదువుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం అప్పటి ఎంఎల్ఎ సురాజ్ దీన్ని అద్దె భవనంలో వేరే చోట పెట్టాలని చూశారు. మా గ్రామస్తులం అడ్డుకున్నాం. కుమారి వీధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో హాస్టల్ శాశ్వత భవనం నిర్మించాలని కోర్టుకు వెళ్లాం. ఇక్కడి నుంచి ఖాళీ చేస్తే సొంత భవనంలోకే వెళ్లాలన్నది మా డిమాండ్. స్థలం ఉన్నా ప్రభుత్వం ఎందుకు శాశ్వత భవనం కట్టించడం లేదన్నదే మా ఆవేదన.

గిరిజనులపై దమనకాండ

(మొదటిపేజి తరువాయి)

పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో, వారు వర్షంలోనే రోడ్డుపైనే బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులు, గిరిజనుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమ నాయకులను విడిచిపెట్టాలని, సరుబుజ్జిలికి తాము వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు ససేమిరా అనడంతో వారు తమ ఆందోళన కొనసాగించారు. థర్మల్ పవర్ ప్లాంట్ ప్రతిపాదనను రద్దు చేయాలని, అక్రమ భూ సేకరణను ఆపాలని, పోలీసు జులుం నశించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రోడ్డుపై చాలా సమయం ఆందోళన చేయడంతో బత్తిలి-అలికాం, సరుబుజ్జిలి-పాలకొండ రహదారులపై ట్రాఫిక్ స్తంభించింది. డిఎస్‌పి వివేకానంద ఉద్యమ నాయకులకు ఫోన్ చేసి గిరిజనులతో ధర్నా విరమింపజేయాలని కోరినా, తమ చేతిలో ఏమీ లేదని వారు తేల్చి చెప్పారు. చివరకు నాయకులను విడిచిపెడతామని చెప్పడంతో గిరిజనులు ఆందోళన విరమించారు. అనంతరం నాయకులను పోలీసులు విడిచిపెట్టారు.

వినతిపత్రం ఇవ్వనీయకుండా అరెస్టులు

తహశీల్దాకు కనీసం వినతిపత్రం ఇవ్వనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, సిర్ల ప్రసాద్, ఎ.రాజు, ఎస్.గోపాలరావుతోపాటు పలువురిని అరెస్టు చేసి సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు.

అరెస్టులు అప్రజాస్వామికం : వామపక్ష పార్టీలు

సరుబుజ్జిలిలో ప్రతిపాదించిన థర్మల్ విద్యుత్ ప్లాంటును విరమించుకోవాలని ధర్నా కోసం వెళ్తున్న వామపక్షాలు, గిరిజన సంఘాల నాయకులను, ప్రజలను అరెస్టు చేయడాన్ని వామపక్ష పార్టీలు ఖండించాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు పి ప్రసాద్, సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్, ఎంసిపిఐయు నాయకులు కాటం నాగభూషణం, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు బి బంగారురావు, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు ఎం రామకృష్ణ, ఎస్‌యుసిఐసి నాయకులు బిఎస్ అమర్‌నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు పివి సుందరరామరాజు, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకిరాములు ఉమ్మడిగా సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించి ఉద్యమకారులను పలు ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడాన్ని ఖండించారు. వివిధ గ్రామాల నుంచి గిరిజనులు మండల కేంద్రానికి రాకుండా అడ్డుకునేందుకు కూడళ్లలో పోలీసు పహారా కాయడం దారుణమని పేర్కొన్నారు. నిర్బంధ వైఖరిని విడనాడాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ధర్నాకు అనుమతించాలని డిమాండ్ చేశారు.

లౌకికవాదం, రాజ్యాంగ విలువల పరిరక్షణే లక్ష్యం !

- ఎన్ఇపిని అంగీకరించినట్లు కాదు
- ఎన్‌సిఇఆర్‌టి సమావేశంలో కేంద్ర విధానాలను ఎండగట్టాం
- కేంద్ర ఎత్తుగడలను చిత్తు చేసేందుకు ఈ నిర్ణయం
- పిఎం-శ్రీ అమలుపై కేరళ విద్యా మంత్రి శివన్‌కుట్టి వివరణ

తిరువనంతపురం : కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం-శ్రీ పథకంపై కేరళలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్రంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అంగీకరించింది. కేంద్రంతో అవగాహనా ఒప్పందంపై (ఎంఓయు) సంతకాలు చేసింది. దీనిపై కాంగ్రెస్ సహా పలు పార్టీల నుండి విమర్శలు వెల్లువెత్తాయి. ఆ విమర్శలను ఒక్కోదాన్ని తిప్పికొడుతూ కేరళ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. పిఎం-శ్రీ అమలు కోసం సంతకం చేయడమంటే జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఇపి) పూర్తిగా అంగీకరించినట్లు కాదని కేరళ విద్యా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి స్పష్టం చేశారు. కేరళ ప్రాధాన్యతలు, విలువలపై ఆధారపడిన విద్యా ప్రాజెక్టుల అమలు మాత్రమే రాష్ట్రంలో కొనసాగుతుందని ఆయన తేల్చి చెప్పారు. ఫెడరల్ సూత్రాలను నీరు గార్చారని వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ఫెడరల్ సూత్రాల కోసం పోరాటంలో భాగమే ఈ నిర్ణయమని తేల్చి చెప్పారు. చిన్న పాఠశాలలు మూతపడతాయన్న ఆందోళనను కొట్టివేశారు. రాష్ట్రంలోని ఒక్క చిన్న పాఠశాల కూడా మూతపడబోదన్నారు. గతంలో సమగ్ర శిక్షా యోజన పథకంలో కూడా ఇదే జరిగిందని గుర్తు చేశారు.

రాష్ట్ర విద్యా ప్రాజెక్టులకే ప్రాధాన్యత

శివకుట్టి విలేకరులతో మాట్లాడుతూ మతోన్మాదంతో కూడిన విద్యా సిలబస్‌కు ద్వారాలు తెరిచారని విమర్శలు వస్తున్నాయని, అది వాస్తవం కాదని అన్నారు. కేరళ సిలబస్ మాత్రమే అమలవుతుందని స్పష్టం చేశారు. 'ఎన్ఇపిని రుద్దేందుకు కేంద్ర ప్రభుత్వం 2022 అక్టోబర్ నుంచి సమగ్ర శిక్షను అమలు చేస్తోంది. ఆ పథకం కింద కేరళ 2023 వరకూ నిధులు పొందినప్పటికీ రాష్ట్ర విద్యా సూత్రాలకు అనుగుణమైన ప్రాజెక్టులనే కొనసాగిస్తోంది. ఇప్పుడు కూడా అదే వైఖరి కొనసాగుతుంది' అని చెప్పారు. ఒప్పందంపై సంతకం చేసే సమయంలో ఎన్ఇపి అమలుకు సంబంధించిన క్లాజు విషయంలో స్వతంత్ర వైఖరి అవలంభించామని ఆయన తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా కమిషన్ సిఫార్సులకు అనుగుణంగానే నడుచుకుంటామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని కనీసం 30 శాతం కూడా అమలు చేయడం లేదని చెప్పారు. ఎన్ఇపి-2020లోని పలు అంశాలు అనేక దశాబ్దాలుగా రాష్ట్రంలో అమలవుతునే వున్నాయని పేర్కొన్నారు. పాఠ్య ప్రణాళికలను రూపొందించాల్సిన బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. ఎన్ఇపిలో కూడా ఇదే వున్నదని ప్రస్తావించారు. ఎన్ఇపిని ప్రవేశపెట్టిన తర్వాత ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకూ పాఠ్య ప్రణాళికలను, పుస్తకాలను మార్చింది ఒక్క కేరళ మాత్రమేనని తెలిపారు. సిలబస్‌ను మార్చడం ద్వారా లౌకికవాదం, రాజ్యాంగ విలువలు వంటి అంశాలపై దృష్టి పెట్టిన రాష్ట్రం కేరళ ఒక్కటి మాత్రమేనని చెప్పారు.

ఎన్‌సిఇఆర్‌టి తొలగించిన పాఠాల కొనసాగింపు

ఎన్‌సిఇఆర్‌టి తొలగించిన పాఠ్యాంశాలైన మహాత్మా గాంధీ హత్య, మొఘలుల చరిత్ర వంటి పాఠాలను కేరళ కొనసాగించిందని శివకుట్టి గుర్తు చేశారు. వాటిని అనుబంధ పాఠ్య పుస్తకాలలో కొనసాగించామని, వాటిపై పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అవే పాఠ్యాంశాలు, పాఠ్య పుస్తకాలు ఎలాంటి మార్పులు లేకుండా ఇక ముందు కూడా కొనసాగుతాయని చెప్పారు. 'స్కూల్ కాంప్లెక్స్' మోడల్ కింద చిన్న చిన్న పాఠశాలలు మూతపడతాయన్న వాదనను ఆయన తోసిపుచ్చారు. గతంలో యుడిఎఫ్ ప్రభుత్వం మూసివేయాలని నిర్ణయించిన పాఠశాలలను కూడా పరిరక్షించి పునరుద్ధరించిన విషయాన్ని గుర్తు చేశారు. పబ్లిక్ ఎడ్యుకేషన్ రెజువనేషన్ (ప్రభుత్వ విద్య పునరుద్ధరణ) మిషన్ ద్వారా గత తొమ్మిది సంవత్సరాల కాలంలో 11 లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని అన్నారు. ఢిల్లీలో ఇరవై రాష్ట్రాల మంత్రులు హాజరైన ఎన్‌సిఇఆర్‌టి సర్వసభ్య సమావేశంలో కేంద్ర ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడింది తానొక్కడినేనని చెప్పారు.



కేంద్ర ఎత్తుగడలను తిప్పికొట్టేందుకే...

రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పాఠ్యపుస్తకాలలో కేంద్ర రాష్ట్ర సంబంధాలు, గవర్నర్ల అధికారాలు వంటి అంశాలను ప్రవేశపెట్టిన ధైర్యం కేరళ రాష్ట్రానిదేనని శివన్‌కుట్టి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధులు అందించకుండా రాష్ట్రాలను ఆర్థికంగా ఇబ్బంది పెడుతోందని ఆయన విమర్శించారు. న్యాయపరంగా మనకు లభించాల్సిన వాటా కోసం కేరళ గట్టిగా నిలబడుతుందని చెప్పారు. పిఎం-శ్రీ గురించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు ముందు పిఎం అనే పదాన్ని చేర్చడం సహజంగా జరుగుతున్నదేనని అన్నారు. 82 కేంద్ర పథకాలలో 17 పథకాలు పిఎంతోనే మొదలయ్యాయని పేర్కొన్నారు. ఆర్థికంగా ఒత్తిడి తేవాలన్న కేంద్ర ప్రభుత్వ ఎత్తుగడను తిప్పికొట్టేందుకే వ్యూహాత్మకంగా పిఎం-శ్రీపై సంతకం చేశామని చెప్పారు. పిఎం-శ్రీ పథకంపై సంతకం చేయనందుకు కేంద్రం సమగ్ర శిక్ష నిధులను నిలిపివేసిందని, ఫలితంగా రాష్ట్రం వేల కోట్ల రూపాయలు నష్టపోయిందని వివరించారు. ఇప్పుడు పిఎం-శ్రీపై సంతకం చేయడంతో రాష్ట్రానికి రూ.1,486.13 కోట్ల నిధులు అందుతాయని తెలిపారు.

చిన్నారుల భవిష్యత్తుపై రాజీ పడం

సమగ్ర శిక్షా నిధుల నిలిపివేతతో 40 లక్షల మంది కేరళ విద్యార్థులపై ప్రభావం పడిందని శివన్‌కుట్టి చెప్పారు. రాజకీయ వెసులుబాటు కోసం చిన్నారుల భవిష్యత్తు విషయంలో కేరళ ప్రభుత్వం రాజీ పడబోదని తేల్చి చెప్పారు. ఈ నిధులు ఏ రాజకీయ పార్టీ నుండో అందుతున్న బహుమతులు కావన్నారు. అది విద్యార్థులకు న్యాయపరంగా దక్కాల్సిన వాటా అని అన్నారు. కేరళ ప్రజలు చెల్లించిన పన్ను వాటాల మొత్తమన్నారు. దీనిపై మన పిల్లలకు న్యాయమైన హక్కు వుందని స్పష్టం చేశారు. ఆ హక్కును సాకారం చేసుకోవాల్సిన బాధ్యత ఈ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. విద్యా రంగంలో ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను ముందుకు తీసుకుపోయేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటిస్తూనే ఉంటామని తెలిపారు. కేరళ ప్రభుత్వం విద్యకు సంబంధించి అనుసరించే లౌకిక, ప్రజాతంత్ర, శాస్త్రీయ మూలాల విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదని శివకుట్టి స్పష్టం చేశారు.

ఎందుకు సంతకం చేయాల్సి వచ్చిందంటే?

ఆర్థిక వాస్తవాలు : పిఎం శ్రీ పథకంపై సంతకాలు చేయలేదనే కారణాన్ని చూపిస్తూ కేంద్ర ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.188.58 కోట్ల నిధులను విడుదల చేయకుండా నిలిపివేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.513.54 కోట్లను ప్రభుత్వం కోల్పోయిందన్నారు. ఇక 2025-26 సంవత్సరంలో కేరళ అందుకోవాల్సిన రూ.456.01 కోట్ల మొత్తాలను నిలిపివేశారు. అంటే మొత్తంగా రూ.1158.13కోట్లను మనకు ఇవ్వకుండా నిలిపివేశారని మంత్రి చెప్పారు. పిఎం శ్రీ పథకం 2027 మార్చితో ముగియనుంది. ఇప్పుడు దీనిపై సంతకాలు చేయడం వల్ల అరియర్లతో పాటూ రెండేళ్ళ నిధులు రూ.1476.13కోట్లు మనకు అందుతాయని చెప్పారు. తక్షణమే రూ.971 కోట్ల నిధులను విడుదల చేయడానికి కేంద్రం ఇప్పటికే అంగీకరించిందని కూడా తెలిపారు.

ఈ నిధులు ఆగిపోతే ప్రభావం ఎవరిపై పడుతుంది?

ఈ నిధులు ఆగిపోతే తక్షణ ప్రభావం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వెనుకబడిన తరగతులకు చెందిన దాదాపు 40లక్షలమంది పిల్లలపై పడుతుందన్నారు. ఈ నిధులు అందితే ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన 5,61,000మంది పిల్లలు లబ్ధి పొందుతారని తెలిపారు. వైకల్యంతో బాధపడే 1,08,000 పిల్లలకు ప్రత్యేక తోడ్పాటు, థెరపీ సదుపాయాలు, వారికి అవసరమైన పరికరాలు వంటివి అందుతాయని శివన్‌కుట్టి వివరించారు.



మీకోసం

వంటకాలు నూనె తక్కువగా పీల్చుకోవాలంటే కూర వండే నూనెలో అరచెంచా వెనిగర్ కలుపుకోవాలి.

జీవన సౌరభం

దృఢ సంకల్పం.. తరగని ఆత్మవిశ్వాసం.. బలమైన కోరిక ఉన్నచోట విజయం తప్పక వచ్చి తీరుతుంది.

స్నేహితులు



అడవిలోన ఒక ఉడుత
దానికి కుందేలు జత
ఆడుకుంటూ పాడుకుంటూ
కలిసిమెలిసి తిరుగుతాయి.

కబుర్లెన్నో చెప్పుకుంటూ
కూరిమిని పెంచుకుంటూ
వనములోన సాటిలేని
మిత్రులుగా మెలుగుతాయి

వారిరువురి కూరిమిని
చూడలేని ఒక కోతి
స్నేహము చెడగొట్టుటకై
పన్నెను ఒక పన్నాగము

కుందేలు లేని సమయాన
ఉడుత చెంత చేరి కోతి
చిన్నగ మాటలు కలిపి
ఉడుతను వశపరుచుకుంటూ

ఓ ఉడుతా! ఓ ఉడుతా!
ఈ సంగతి తెలుసునా?
అహంకారి కుందేలు
ఏమన్నదో ఎరుగుదువా?

అడవిలోన అత్యంత
అందగత్తె తానంట
తన అందం ముందర
నీ రూపం వ్యర్థమంట

'నిజమేలే కోతి బావ
కుందేలే అందగత్తె'
అసూయను రానియ్యక
బదులిచ్చెను ఉడుత

గుబురు పొదల చాటున
నక్కి ఉన్న కుందేలు
ఒక్క ఉదుటన గెంతుకుంటూ
కోతి ముందు నిలబడెను!

అంతగత్తె నేనంటూ
ఎన్నడైన పలికానా
ప్రియమైన ఉడుతను
పలుచన చేసెదనా?


గట్టిగానే కోతిని
నిలదీసెను కుందేలు
ఊహించని ఘటనకు
బిత్తరపోయింది కోతి.

'ఓరోరి కోతి బావ
నీ జిత్తులు పనిచేయవు
ఎన్ని ఎత్తులేసినా
మమ్ము విడదీయలేవు'

ఉడుతా కుందేలు కలసి
అరిచి మరీ చెప్పాయి
కోతి బావ జడుసుకుంది
నెమ్మదిగా జారుకుంది!

అరమరికలు లేకుండా
ఉడుతా కుందేలు కలిసి
అమర స్నేహితులుగా
అడవిలోన కీర్తించబడెను!

- పేట యుగంధర్,
వెదురుకుప్పం,
94925 71731.



అవి ఏవీ?


పిల్లలూ, ఇక్కడ రెండు వరుసల్లో కప్పలు ఉన్నాయి. వీటిలో రెండు కప్పలు ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏంటో కనిపెట్టండి.

జవాబు : 1-4

నేను గీసిన బొమ్మ



కె.ప్రేమ్‌తేజ,
6వ తరగతి,
ఎంపియుపి స్కూలు,
పి.నైనవరం,
ఎన్‌టిఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తుపాను : అప్రమత్తతే రక్షణ



- ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమం
- వరద ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించరాదు
- వర్షం వస్తున్నప్పుడు చెట్ల కింద ఉండరాదు
- వర్షంలో తడవడం, చిన్నపిల్లలు వర్షంలో ఆడకుండా చూసుకోవాలి.
- విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు, వైర్లు, మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి.
- ముంపు ప్రాంతాల్లోకి ప్రవేశించొద్దు
- ఎలక్ట్రికల్ గాడ్జెట్లు, మెషినరీని అన్‌ప్లగ్ చేయండి. నీటికి దూరంగా ఉంచండి
- తగినంత ఆహారం, తాగునీరు నిల్వ చేయండి
- గ్యాస్ వాల్వ్‌లు, కనెక్ట్ చేయబడిన పరికరాలను ఆపేయాలి
- కుటుంబాన్ని, పెంపుడు జంతువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి.
- అవసరమైన మందులతో కూడిన ప్రథమ చికిత్స పెట్టెను దగ్గర ఉంచుకోవాలి.
- వరద నీటి ప్రవేశాన్ని అడ్డుకోవటానికి కాలువల్లో ఇసుక సంచులను వేయొద్దు
- ముంపు నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశిస్తే ఇంటిని ఖాళీ చేయాల్సి రావొచ్చు. ఇంటిని ఖాళీ చేస్తే వాహనాలను కూడా సురక్షిత ప్రాంతాల్లో పెట్టుకోవాలి. విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచొద్దు.
- మీ ఇంటిలోపల ఒక టేబుల్ లేదా ఎత్తైన ప్రదేశంలో అన్ని ఫర్నిచర్, బెడ్ మెటీరియల్స్, ఉపకరణాలు ఉంచాలి
- ప్రథమ చికిత్స వస్తు సామగ్రి, పొడి ఆహారం, తాగునీరు మీ వెంట తీసుకెళ్లండి.
- తెగేందుకు ఆస్కారం ఉన్న కరకట్ట ప్రాంతాల్లో నివాసిత ప్రాంతాల నుంచి ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు వెళ్లాలి.
- శిథిలావస్థలో ఉన్న, పాడుపడిపోయిన ఇళ్లల్లో నివసించొద్దు.
- మురుగునీటి కాల్వలు, కల్వర్టులకు దూరంగా ఉండాలి.
- వరద నీటిలో నడవకండి. రెండు అడుగుల మేర ప్రవహించే వరద నీరు పెద్ద కార్లను కూడా తోసుకుపోగలవు.
- వరద ప్రవహించే వాగులు, వంకలు, కాలువలు దాటే ప్రయత్నం చేయకండి.
- వేడిచేసిన, క్లోరినేటెడ్ నీటినే తాగండి.

రాష్ట్రంలో తుపాను నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నదీ, సముద్ర తీరాల్లోని ప్రజానీకం మరింత అప్రమత్తంగా ఉండాలి. వాతావరణ శాఖ సూచించే సలహాలు, హెచ్చరికలను పాటించాలి. సాధ్యమైనంత వరకూ బయటకు వెళ్లకుండా ఉండటమే శ్రేయస్కరం

12 కంట్రోల్ రూములు ఏర్పాటు

తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణశాఖ ద్వారా మొత్తం 12 కంట్రోల్ రూములను ఏర్పాటు చేసింది. ఇవేకాకుండా ఎపిఎస్‌డిఎంఎ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌లో 112, 1070, 18004250101 టోల్‌ఫ్రీ నంబర్లు కూడా అందుబాటులో ఉంచింది.



కరెంట్ తీగలతో జాగ్రత్త!

ఎపి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 32 చోట్ల కంట్రోల్ రూమ్‌నంబర్లు ఏర్పాటు చేసింది. ఆ సంస్థ కార్పొరేట్ ఆఫీసు సెల్ : 83310 18762, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 1912ను ఏర్పాటు చేసింది. కింది సూచనలు చేసింది.

- తడిచిన విద్యుత్ స్తంభాల సపోర్ట్‌వైర్, విద్యుత్ ఉపకరణాలను తాకరాదు
- బట్టలు ఆరేసుకునే తీగకు విద్యుత్‌వైర్లు కలపరాదు
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తే వెంటనే విద్యుత్‌శాఖకు తెలియజేయాలి
- వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ మోటార్లు ఆన్ చేయరాదు
- గృహాల్లో అతుకులు లేని సర్వీసు వైర్లు మాత్రమే ఉపయోగించాలి
- తెగిపడిన, వేలాడుతున్న తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌తీగలను తాకరాదు
- విద్యుత్ మరమ్మతుల కోసం సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలి
- విద్యుత్‌షాక్‌నకు గురైన వ్యక్తిని ముట్టుకోవద్దు
- వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి
- విద్యుత్‌శాఖ సిబ్బందిని సంప్రదించి వారి సేవలను పొందాలి



నోట్‌బుక్స్ తాత!

న్యూస్ పేపర్ కట్టలు విప్పి పంపిణీకి వీలుగా సర్దుకోవడం ప్రతి పేపరు బాయ్ చేసే దినచర్య. ప్రింటింగు సెంటర్ నుంచి పేపర్ కట్టలు బయటికి పంపేటప్పుడు కట్టలకి కట్టిన దారం పేపర్లపై ఒత్తిడి చేయకుండా పేపర్లపై ఓ తెల్లని కాగితం పెట్టి ముడివేస్తారు. పేపర్ బాయ్‌లు ఆ కట్టలు విప్పుతున్నప్పుడు పైన ఉన్న కాగితాన్ని పక్కన పడేస్తారు. అయితే బెంగళూరు బ్యాంక్ కాలనీలో పేపర్ బాయ్స్ కట్టలు విప్పేటప్పుడు – ఓ పెద్దాయన వచ్చి నిల్చుంటాడు. పడేసిన ఆ తెల్లని కాగితాలని జాగ్రత్తగా ఏరుకుని ఇంటికి తెచ్చుకుంటాడు. వాటితో ఆయన చేస్తున్న పని తెలుసుకుంటే మాత్రం ఆశ్చర్యంతో పాటు అభినందించకుండా ఉండలేం.

ఐటిఐ కంపెనీలో రిటైర్డ్ ఉద్యోగి అయిన మోహన్ ఈ పని చేయడం వెనుక ఓ బృహత్తర కార్యక్రమం ఉంది. సేకరించిన ఆ కాగితాలని నోట్ బుక్స్‌కి సరిపోయే సైజులో కత్తిరించి పక్కనబెడతాడు. కొన్ని రోజులు తరువాత వాటిని నోటు పుస్తకాలుగా బైండింగ్ చేయిస్తాడు. అలా తయారైన పుస్తకాలని దగ్గర్లోని ప్రభుత్వ స్కూలుకెళ్లి పేద పిల్లలకి పంపిణీ చేస్తాడు.

మోహన్ చేస్తున్న పని ఆ పిల్లలపై ఎంత ప్రభావం చూపిస్తుందంటే.. మోహన్‌ని వాళ్లంతా 'నోట్‌బుక్ తాత' అని పిలుస్తారు. అతను ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తారు. వృథా నుండి ఉపయోగకర వస్తువులు తయారుచేసే వారి గురించి చాలాసార్లు విన్నాం. అలంకరణల కోసమో.. వ్యాపారాల కోసమో వృథా వస్తువులని ఉపయోగిస్తున్న వారిలో మోహన్ ప్రత్యేకమైన వ్యక్తి. తన స్వలాభం కోసం కాకుండా పేదపిల్లల ముఖాల్లో సంతోషం కోసం ఆయన తన విశ్రాంత జీవితాన్ని కూడా త్యాగం చేస్తున్నారు. అందుకే మోహన్ చేస్తున్న కృషి గురించి తెలిస్తే ఆయన్ని అభినందించకుండా ఉండలేం.




21న '12ఎ రైల్వే కాలనీ'

అల్లరి నరేష్ హీరోగా రూపొందుతున్న థ్రిల్లర్ చిత్రం '12ఎ రైల్వే కాలనీ'. 'పొలిమేర', 'పొలిమేర 2' చిత్రాల దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలను అందించారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పిస్తున్న ఈ చిత్రంతో నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎడిటింగ్ బాధ్యతలు కూడా చేస్తున్నారు. నవంబర్ 21వ తేదీన ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. డా. కామాక్షి భాస్కర్ల ఇందులో కథానాయికగా నటిస్తున్నారు. ఇతర పాత్రల్లో సాయి కుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, జీవన్ కుమార్, గగన్ విహారి, అనీష్ కురువిల్లా, మధుమణి తదితరులు నటిస్తున్నారు.

2న 'చౌదరి గారి అమ్మాయి' ప్రీమియర్ షో



ఎల్లో టకోమా ప్రొడక్షన్ బ్యానర్‌లో ఎడ్‌కాన్ ప్లస్ సంస్థ నిర్మించిన సినిమా 'చౌదరి గారి అమ్మాయి' ప్రీమియర్ షో నవంబర్ రెండోతేదీన విజయవాడలోని శైలజ థియేటర్‌లో ప్రదర్శించనున్నారు. సిద్ధూ వర్మ కాకాని దర్శకత్వంలో తెరకెక్కిన వినయ్‌తేజ్, రిషిత జోడీగా నటించారు. డిఒపి మహేష్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆదిత్య ఆత్రేయ, కో రైటర్‌గా సామ్, మేకప్ పెనుమాక నాని. కథ, స్క్రీన్ ప్లే, డైలాగులు, ఎడిటింగ్, దర్శకత్వం సిద్ధువర్మ. ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ షో ఏర్పాటు చేసినట్లు చిత్ర యూనిట్ తెలిపింది.




'కృష్ణ లీలా' ట్రైలర్ విడుదల

దేవన్, ధన్య బాలకృష్ణన్ హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న తాజా చిత్రం 'కృష్ణ లీలా'. దేవన్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'తిరిగొచ్చిన కాలం..' అనేది ఈ మూవీకి ట్యాగ్‌లైన్. ఈ సినిమాను మహాసేన్ విజువల్స్ బ్యానర్‌లో జ్యోత్స్న నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో వినోద్ కుమార్, పృథ్వి (పెళ్లి), రవి కాలే, తులసి, 7ఆర్ట్ సరయు, ఆనంద్ భరత్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

'జీడీ నాయుడుగా' మాధవన్



మాధవన్ మరో బయోపిక్‌లో నటిస్తున్నారు. 'ఎడిసన్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన జీడీ నాయుడు పాత్రలో ఆయన నటించబోతున్నారు. కోయంబత్తూరుకు చెందిన నాయుడు ఎలక్ట్రానిక్ మోటర్స్‌తో పాటు పలు వ్యవసాయ ఉపకరణాలను కనిపెట్టారు. కృష్ణ కుమార్ రామకుమార్ దర్శకత్వంలో వర్గీస్ మూలన్ పిక్చర్స్, ట్రైకలర్ ఫిలిమ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రియమణి, జయరామ్, యోగి బాబు తదితరులు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. గోవింద్ వసంత ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. వచ్చే యేడాది వేసవిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.



త్వరలో 'కిల్లర్' విడుదల

'శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు పూర్వాజ్ 'కిల్లర్' అనే సై-ఫై యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయనే కథానాయకుడు. జ్యోతి పూర్వజ్ కథానాయిక. విశాల్‌రాజ్, దశరథ, చందూ, గౌతమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఉర్వీష్ పూర్వజ్ సమర్పణలో ఎయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న రెండో చిత్రమిది. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయని నిర్మాతలు తెలిపారు. త్వరలోనే సినిమా విడుదల తేదీనిప్రకటిస్తామని పేర్కొన్నారు. సినిమాటోగ్రఫీ జగదీష్ బొమ్మిశెట్టి, సంగీతం ఆశీర్వాద్, సుమన్ జీవ, విఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్, లైన్ ప్రొడ్యూసర్ దశరథ, రచన, దర్శకత్వం పూర్వాజ్.

మూడోరోజు ఆట వర్షార్పణం

- ఆంధ్ర × బరోడా రంజీట్రోఫీ మ్యాచ్
- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో పృథ్వీ షా డబుల్ సెంచరీ
- రంజీట్రోఫీ



విజయనగరం: ఆంధ్ర-బరోడా జట్ల మధ్య విజయనగరంలో జరుగుతున్న రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్ వర్షం కారణంగా మూడోరోజు ఆట రద్దయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో బరోడా జట్టు 363పరుగులకు ఆలౌట్ కాగా.. అనంతరం తొలి ఇన్నింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండోరోజు 2వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది. అనంతరం భారీ వర్షం కురవడంతో మ్యాచ్ నిలిచింది. అభిషేక్ రెడ్డి(15), వికెట్ కీపర్ శ్రీకర్ భరత్(8) నిరాశపరచగా.. రషీద్(12), కెప్టెన్ రికీ బుయ్(7) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు ఆంధ్ర బౌలర్లు సాయితేజ(4/71), త్రిపురన విజయ్(3/63) రాణించి బరోడా జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 363పరుగులకే పరిమితం చేశారు. బరోడా బ్యాటర్ విష్ణు సోలంకి(131) సెంచరీకి తోడు కెప్టెన్ అతిత్ శేఠ్ (86), మహేష్(54) అర్ధసెంచరీలతో రాణించారు. ఆంధ్ర ఇంకా 320 పరుగులు వెనుకబడి ఉంది.

పృథ్వీ షా 141బంతుల్లో డబుల్ సెంచరీ

మహారాష్ట్ర ఓపెనర్ పృథ్వీ షా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో వేగంగా మూడో డబుల్ సెంచరీని కొట్టాడు. ఛండీగడ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో పృథ్వీ షా కేవలం 141 బంతుల్లోనే డబుల్ సెంచరీని పూర్తి చేశాడు. ఇది రంజీట్రోఫీ చరిత్రలో మూడో వేగవంతమైన డబుల్ సెంచరీ. అంతకుముందు రవిశాస్త్రి 1984-85లో బరోడాపై కేవలం 123బంతుల్లో, తన్మయ్ అగర్వాల్ 2024లో అరుణాచల్ ప్రదేశ్‌పై కేవలం 119బంతుల్లోనే డబుల్ సెంచరీలు కొట్టి పృథ్వీ షా కంటే ముందు ఉన్నారు. ఇక మహారాష్ట్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 3వికెట్ల నష్టానికి 359పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్డ్ చేసి 464పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడోరోజు ఆట నిలిచే సమయానికి ఛండీగడ్ జట్టు వికెట్ నష్టపోయి 129పరుగులు చేసింది.

ఆధిక్యతకు చేరువలో హైదరాబాద్

పాండిచ్చేరితో జరుగుతున్న మరో రంజీట్రోఫీ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతకు చేరువలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ జట్టు 435పరుగులు చేయగా.. మూడోరోజు ఆట నిలిచే సమయానికి పాండిచ్చేరి జట్టు 8వికెట్ల నష్టానికి 92పరుగులే చేసింది.

ఫైనల్‌కు దబాంగ్ ఢిల్లీ

- టై బ్రేకర్‌లో పుణేరి పల్టన్స్‌పై గెలుపు
- నేడు తెలుగు టైటాన్స్‌తో పట్నా ఢీ



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ సీజన్-12 ఫైనల్లోకి దబాంగ్ ఢిల్లీ ప్రవేశించింది. టాప్-2 జట్ల మధ్య సోమవారం జరిగిన ఉత్కంఠభరిత పోటీలో దబాంగ్ ఢిల్లీ జట్టు టై బ్రేకర్‌లో పుణేరి పల్టన్స్‌ను చిత్తుచేసింది. నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరుజట్లు 34-34పాయింట్లతో సమంగా నిలిచాయి. టై బ్రేకర్‌లో ఢిల్లీ జట్టు 6-4పాయింట్ల తేడాతో పుణేరి చిత్తుచేసింది. ఈ గెలుపుతో ఢిల్లీ ఫైనల్‌కు చేరగా.. పుణేరి జట్టు క్వాలిఫయర్-2లో మంగళవారం జరిగే తెలుగు టైటాన్స్, పట్నా పైరెట్స్ మ్యాచ్ విజేతతో తలపడనుంది. మరో పోటీలో పట్నా పైరెట్స్ హవా కొనసాగుతోంది. ఆదివారం జైపూర్ పింక్ ప్యాంథర్స్‌ను చిత్తుచేసిన పట్నా జట్టు.. నేడు బెంగళూరు బుల్స్‌కు చెక్ పెట్టి తెలుగు టైటాన్స్‌తో పోటీకి సిద్ధమైంది. త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో బెంగళూరు బుల్స్‌తో హోరాహోరీగా సాగిన పోరులో పట్నా పైరెట్స్ 46-37పాయింట్ల తేడాతో విజయం సాధించింది. రెండో అర్ధభాగంలో బుల్స్ రైడర్ పట్నాకు చెందిన ఆరుగురు ఆటగాళ్లను ఔట్ చేసినా.. ఏమాత్రం వెనుకంజ వేయకుండా విజయం సాధించడం విశేషం. 29న క్వాలిఫయర్-2 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్లో దబాంగ్ ఢిల్లీతో 31న తలపడనుంది.

షెఫాలీ ఇన్.. ప్రతీక రావల్ ఔట్..

- ఆస్ట్రేలియాతో సెమీస్‌కు ఎంపిక



ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచ కప్‌కు టీమిండియా యువ ఓపెనర్ ప్రతీక రావల్ దూరమైంది. ఈమేరకు బిసిసిఐ సోమవారం ఒక ప్రకటనలో ప్రతీక రావల్ స్థానంలో 21ఏళ్ల షెఫాలీ వర్మను ఎంపిక చేసినట్లు ప్రకటించింది. దీంతో సెమీస్‌కు ముందు భారతజట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయ్యింది. ఫామ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ ప్రతీక రావల్ ఆసీస్‌తో మ్యాచ్‌కు దూరం కావడంపై అభిమానుల్లో కొంత నిరుత్సాహం నెలకొంది. బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ.. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో మోకాలి గాయానికి గురైన ప్రతీక కుంటుతూ మైదానాన్ని వీడింది. గాయం తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా ఆమెకు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం. దాంతో 30న(గురు) ఆస్ట్రేలియాతో జరిగే సెమీస్ మ్యాచ్‌కు ఆమె అందుబాటులో ఉండదని బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. ప్రతీక గాయపడ్డ తీవ్రతపై ఆసుపత్రి బులెటిన్‌లోగానీ, బిసిసిఐ నుంచి సోమవారం వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అలాగే కోచ్ మజుందార్ కూడా ఈ విషయమై ఎలాంటి స్పష్టతను ఇవ్వలేదు. ఈనెల 30న భారత మహిళల జట్టు రెండో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ టోర్నీలో ప్రతీక ఆరు మ్యాచుల్లో ఒక శతకం, అర్ధ సెంచరీలతో కలిపి 308 పరుగులతో రాణించింది. ప్రతీక స్థానంలో ఆసీస్‌తో సెమీస్‌కు మంధానకు జోడీగా షెఫాలీ వర్మ బరిలోకి దిగనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68